
RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ సీఎండీ & ఎడిటర్
సంపుటి: 4 సంచిక:135 | మే 24, 2026 | వెల: రూ.3-00 | 9701923260




## ట్రంప్‌పై ఇరాన్ వ్యంగ్య పోస్టు

బంగ్లాదేశ్ దున్నపోతుతో పోలిక

2లో

## తెలంగాణ పోలీసింగ్‌కు ఏఐ టెక్నాలజీ

- స్మార్ట్ పోలీసింగ్ కోసం ప్రత్యేక టెక్ టీమ్ ఏర్పాటు
- సీసీటీఎన్ఎస్, హెచ్ఆర్ఎంఎస్ సమగ్ర అనుసంధానం
- ప్రజలకు వేగవంతమైన సేవలే లక్ష్యంగా చర్యలు
- ఆధునిక వ్యవస్థల అనుసంధానంపై డీజీపీ సమీక్ష

2లో



**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**

తెలంగాణ పోలీసింగ్ వ్యవస్థను మరింత స్మార్ట్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ ఆధునిక సాంకేతికత వైపు కీలక అడుగులు వేస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సేవలను పోలీసింగ్‌లో విస్తృతంగా వినియోగించేందుకు రాష్ట్ర పోలీస్ కార్యాలయంలో డీజీపీ సీవీ ఆనంద్ ఐపీఎస్ శనివారం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా మార్చే దిశగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలులో ఉన్న సీసీటీఎన్ఎస్,

మిగతా 2వ పేజీలో..

## కారుతో గుద్ది చంపేశారు

- మాసబ్‌ట్యాంక్‌లో న్యాయవాది హత్య
- కారుతో ఢీకొట్టి పరారైన దుండగులు
- చికిత్స పొందుతూ ఆసుపత్రిలో కన్నుమూత
- ఘటనపై అనుమానాస్పద కోణాల్లో దర్యాప్తు
- వక్ఫ్ భూముల రక్షణ కోసం పోరాడుతున్న ఖాజా మొయినుద్దీన్

2లో






# కారు వీరులేరి?!

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణలో పదేళ్ల పాటు తిరుగులేని అధికార పీఠాన్ని అనుభవించిన నాడు గులాబీ దళపతులు.. నేడు ప్రతిపక్షంలోకి రాగానే క్షేత్రస్థాయిలో సైలెంట్ అయిపోవడం బీఆర్ఎస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నాడు మంత్రులుగా, కీలక పదవుల్లో ఉంటూ దర్జా ఒలకబోసిన హేమాహేమీలు.. ఇప్పుడు పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, క్షేత్రస్థాయిలో క్యాడర్‌కు అండగా నిలబడేందుకు ముందుకు రావడం లేదనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. రాష్ట్రస్థాయిలో కేటీఆర్, హరీశ్ రావు వంటి ఒకరిద్దరు నాయకులు మాత్రమే ప్రభుత్వ వైఫల్యాలపై నిరంతరం పోరాడుతుండగా, మిగతా జిల్లాల అధ్యక్షులు, మాజీ మంత్రులు మాత్రం ఇంటికే పరిమితమయ్యారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ వైఖరితో కిందిస్థాయి క్యాడర్‌లో తీవ్ర నైరాశ్యం అలుముకుంది. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తానే 2034 వరకు సీఎంగా ఉంటానని, కాంగ్రెస్ సుస్థిర పాలన అందిస్తుందని ధీమాగా ప్రకటిస్తుంటే.. దానికి కౌంటర్ ఇచ్చేలా, కనీసం ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా గులాబీ లీడర్లలో చలనం లేకపోవడం గమనార్హం.

## పార్టీని ముందుకు నడిపిస్తున్నది కేటీఆర్, హరీశ్ రావే

### ఒకరిద్దరు మినహా కానరాని ముఖ్యనేతలు

- పదేళ్లు దర్జా ఒలకబోసిన నేతలు ఇప్పుడెక్కడ?
- గల్లీల్లో కనిపించని మాజీ మంత్రులు, జిల్లా అధ్యక్షులు
- పైనుంచి ఆదేశాలు వస్తేనే అరకొర హడావుడి
- 2034 వరకు తామదే అధికారం అంటున్న కాంగ్రెస్
- గులాబీ లీడర్లలో మాత్రం కనిపించని చలనం
- జగిత్యాల సభతో బాస్ ఇచ్చిన జోష్ ఏది?
- కేడర్లో నైరాశ్యం.. పక్క చూపులు చూస్తున్న ద్వితీయ శ్రేణి నాయకత్వం

2లో

## ఇప్పటి నుంచే అలర్ట్ కావాలంటున్న గులాబీ సైన్యం

## టీటీడీ తరహాలో యాదాద్రిని తీర్చిదిద్దుతాం

- వేద సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత
- సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాలకు శ్రీకారం
- రూ.99 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- వేద విద్య, భక్తి వైభవానికి కొత్త అధ్యాయం



2లో

## హీట్ వేవ్ అలర్ట్!

- వడగాల్పులతో ఏడు జిల్లాల్లో 16 మంది మృతి
- మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం
- ప్రజల ప్రాణ రక్షణకు యుద్ధప్రాతిపదికన చర్యలు
- కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి ఆదేశాలు

**వేద న్యూస్, హైదరాబాద్**

రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమవుతున్న వడగాల్పుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అత్యవసర అప్రమత్తత చర్యలు చేపట్టింది. రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. వచ్చే మూడు రోజుల్లో



వడగాల్పుల ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా

మిగతా 2వ పేజీలో.

వేద న్యూస్

ఆదివారం | మే 24, 2026

## అంధకారంలో శ్మశానవాటిక!

- రాత్రివేళల్లో అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు
- నీరు, లైట్లు లేక అవస్థలు పడుతున్న ప్రజలు
- వెంటనే కనీస వసతులు కల్పించాలని డిమాండ్



**వేద న్యూస్, వరంగల్ టౌన్**

వరంగల్ నగరంలోని పోతన నగర్ శ్మశానవాటికలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో శ్మశానవాటిక పూర్తిగా అంధకారంలో మునిగిపోతుండటంతో అంత్యక్రియలకు వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారు. శ్మశానవాటికలో ఒక్క వీధి దీపం కూడా సరిగా లేకపోవడంతో రాత్రి సమయంలో భయానక వాతావరణం నెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సౌకర్యం సరిగా లేకపోవడంతో అంత్యక్రియల సమయంలో అవసరమైన నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మెయింటెనెన్స్ పూర్తిగా గాలికొదిలేయడంతో శుభ్రత లేక స్మశానవాటిక నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో సరైన లైటింగ్ లేకపోవడంతో మహిళలు, వృద్ధులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. స్మశానవాటికలో కనీస భద్రతా చర్యలు కూడా లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తక్షణమే స్మశానవాటికలో విద్యుత్ దీపాలు, తాగునీటి సదుపాయం, శుభ్రత, భద్రత వంటి కనీస వసతులు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని స్థానికులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

## తెలంగాణ పోలీసింగ్‌కు ఏఐ టెక్నాలజీ

**మొదటి పేజీ తరువాయి**



హెచ్ఆర్ఎంఎస్, హాక్ఐ వంటి డిజిటల్ వ్యవస్థలను పరస్పరం అనుసంధానం చేసే అంశంపై అధికారులు సమగ్రంగా చర్చించినట్లు సమాచారం. సాంకేతిక పరిజ్ఞానంతో పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. పోలీస్ శాఖలో డేటా సమన్వయం, నేరాల విశ్లేషణ, సిబ్బంది నిర్వహణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఏఐ సాంకేతికత కీలక పాత్ర పోషించనుందని సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలిసింది. ఆధునిక టెక్నాలజీ సహాయంతో నేర నియంత్రణను మరింత బలోపేతం చేయడంతో పాటు విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని డీజీపీ సూచించారు. ఈ క్రమంలో ప్రత్యేక టెక్ టీమ్‌ను ఏర్పాటు చేసి వివిధ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర పోలీసింగ్ వ్యవస్థను దేశంలోనే అత్యాధునికంగా తీర్చిదిద్దే దిశగా సాంకేతిక మార్పులు చేపట్టాలని డీజీపీ సీవీ ఆనంద్ అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. హాక్ఐ యాప్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను మరింత విస్తరించడంతో పాటు పోలీస్ శాఖ అంతర్గత వ్యవస్థలను కూడా డిజిటల్ పద్ధతుల్లో సమగ్రపరచాలని సమావేశంలో సూచించారు. పోలీస్ శాఖలో పారదర్శకత, వేగం, సమన్వయం పెంచడంలో ఈ ఆధునిక విధానాలు కీలకంగా మారనున్నాయని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ పోలీసింగ్ అమలుకు తెలంగాణ పోలీస్ శాఖ ఇప్పటికే పలు ఆధునిక కార్యక్రమాలు చేపట్టిందని, ఇప్పుడు ఏఐ సాంకేతికతతో మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు కార్యాచరణ కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

## హీట్ వేవ్ అలర్ట్!

**మొదటి పేజీ తరువాయి**

హీట్ వేవ్ పరిస్థితులపై జిల్లాల వారీగా సమీక్షించిన మంత్రి, వడదెబ్బ కారణంగా ఏడు జిల్లాల్లో 16 మంది మరణించినట్లు అధికారుల నివేదికల ద్వారా తెలుసుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నలుగురు, వరంగల్ అర్బన్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ముగ్గురు చొప్పున, జోగులాంబ గద్వాల్, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు మృతి చెందినట్లు అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు ప్రతి మృతుడి కుటుంబానికి రూ.4 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని ఆదేశించారు. ఎండల తీవ్రత అసాధారణ స్థాయికి చేరుకుందని, ఎల్‌నినో ప్రభావంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలగకుండా ప్రతి స్థాయిలో అప్రమత్త చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న మండలాలు, గ్రామాలను గుర్తించి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు పంపించాలని అధికారులను ఆదేశించారు. మీడియా, సోషల్ మీడియా, గ్రామస్థాయి ప్రకటనల ద్వారా ఎండలపై అవగాహన కల్పించాలని సూచించారు. బస్ స్టాండ్లు, మార్కెట్లు, ప్రధాన రహదారులు, కార్మికులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాల్లో చల్లని తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని మంత్రి తెలిపారు. వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ, నిర్మాణ రంగ కార్మికులకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లా కలెక్టర్ హీట్ వేవ్ పరిస్థితులను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని, మండల స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులు ఫీల్డ్‌లో ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. ఎండదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స అందించేందుకు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజలతో పాటు పక్షులు, జంతువుల రక్షణ కూడా ముఖ్యమని గ్రామాలు, పట్టణాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం ఈ నెల 26 వరకు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో తీవ్రమైన ఉష్ణోగ్రతలు కొనసాగనున్నాయని మంత్రి వెల్లడించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు కూడా ప్రభుత్వ సూచనలు తప్పనిసరిగా పాటించి అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.

# కారు వీరులేరి?!

- పార్టీని ముందుకు నడిపిస్తున్నది కేటీఆర్, హరీశ్ రావే
- ఒకరిద్దరు మినహా కానరాని ముఖ్యనేతలు
- పదేళ్లు దర్జా ఒలకబోసిన నేతలు ఇప్పుడెక్కడ?
- గల్లీల్లో కనిపించని మాజీ మంత్రులు, జిల్లా అధ్యక్షులు..
- పైనుంచి ఆదేశాలు వస్తేనే అరకొర హడావుడి
- 2034 తామే అధికారంలో ఉంటాం అంటున్న కాంగ్రెస్
- గులాబీ లీడర్లలో మాత్రం కనిపించని చలనం
- జగిత్యాల సభతో బాస్ ఇచ్చిన జోష్ ఏది?
- కేడర్లో నైరాశ్యం.. పక్కచూపులు చూస్తున్న ద్వితీయ శ్రేణి నాయకత్వం
- ఇప్పటి నుంచే అలర్ట్ కావాలంటున్న గులాబీ సైన్యం




**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణలో పదేళ్ల పాటు తిరుగులేని అధికార పీఠాన్ని అనుభవించిన నాడు గులాబీ దళపతులు.. నేడు ప్రతిపక్షంలోకి రాగానే క్షేత్రస్థాయిలో సైలెంట్ అయిపోవడం బీఆర్ఎస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నాడు మంత్రులుగా, కీలక పదవుల్లో ఉంటూ దర్జా ఒలకబోసిన హేమాహేమీలు.. ఇప్పుడు పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, క్షేత్రస్థాయిలో క్యాడర్‌కు అండగా నిలబడేందుకు ముందుకు రావడం లేదనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. రాష్ట్రస్థాయిలో కేటీఆర్, హరీశ్ రావు వంటి ఒకరిద్దరు నాయకులు మాత్రమే ప్రభుత్వ వైఫల్యాలపై నిరంతరం పోరాడుతుండగా, మిగతా జిల్లాల అధ్యక్షులు, మాజీ మంత్రులు మాత్రం ఇంటికే పరిమితమయ్యారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ వైఖరితో కిందిస్థాయి క్యాడర్‌లో తీవ్ర నైరాశ్యం అలుముకుంది.

### ఆదేశాలు వస్తేనే హడావుడి..

గతంలో గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నిరంతరం ప్రజల్లో తిరుగుతూ, హడావుడి చేసిన నేతలు.. ఇప్పుడు పూర్తిగా ముఖం చాటేశారు. పార్టీ అధిష్ఠానం పైనుంచి ఏదైనా నిర్దిష్టమైన ఆదేశాలు ఇస్తే తప్ప, వీరు సొంతంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదు. ఆ ఆదేశాలు వచ్చినప్పుడు కూడా కేవలం మీడియా ముందో, ఆఫీసులకో పరిమితమై అరకొర హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప, క్షేత్రస్థాయిలో జనాల్లోకి వెళ్లి వారి సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి చూపడం లేదు. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తానే 2034 వరకు సీఎంగా ఉంటానని, కాంగ్రెస్ సుస్థిర పాలన అందిస్తుందని ధీమాగా ప్రకటిస్తుంటే.. దానికి కౌంటర్ ఇచ్చేలా గులాబీ లీడర్లలో ఎలాంటి చలనం లేకపోవడం గమనార్హం.

### కేటీఆర్, హరీశ్ తప్ప మిగతావారు గప్‌చుప్

ప్రస్తుతం బీఆర్ఎస్ తరపున క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న బాధ్యతను కేవలం వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు మాత్రమే భుజాన వేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ సమస్యలపై వీరుద్దరే వాయిస్ వినిపిస్తున్నారు. పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకులు సైతం ఇదే విషయాన్ని బాహాటంగా చెబుతున్నారు. ‘కేటీఆర్, హరీశ్ రావు అన్నలు మాత్రమే కాంగ్రెస్ వైఫల్యాలపై ఫైట్ చేస్తున్నారు. మిగతా ముఖ్యనేతలు ఎవరూ పార్టీ కార్యక్రమాలను జనాల్లోకి తీసుకెళ్లే బాధ్యతను తీసుకోవడం లేదు. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని క్యాష్ చేసుకోవడంలో మాజీ మంత్రులు ఘోరంగా విఫలమవుతున్నారు’ అని జిల్లా స్థాయి నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### బాస్ ఇచ్చిన జోష్‌ను నీరుగారుస్తున్న ఇన్చార్జులు

మొన్నటి జగిత్యాల బహిరంగ సభలో గులాబీ బాస్ కేసీఆర్ చేసిన ధ్వజమెత్తే ప్రసంగం, ఇచ్చిన పిలుపుతో పార్టీ క్యాడర్‌లో ఒక్కసారిగా ఊపు వచ్చింది. నిస్తేజంలో ఉన్న గులాబీ సైన్యం బాస్ స్పీచ్‌తో మళ్లీ యాక్టివ్ అయింది. అయితే, అధినేత కల్పించిన ఆ ఉత్సాహాన్ని క్షేత్రస్థాయిలో నిలబెట్టడంలో జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్చార్జ్లు తీవ్రంగా విఫలమయ్యారు. ఆ సభ తర్వాత కూడా వారు ఎక్కడా పార్టీని ఉత్సాహపరిచేలా, క్యాడర్‌ను కలుపుకుపోయేలా కార్యాచరణ రూపొందించుకోలేదనేది జగమెరిగిన సత్యం.

### ఇప్పటి నుంచే సిద్ధం కాకపోతే మునిగిపోవడం ఖాయం

రాజకీయాల్లో ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ప్రజల పక్షాన నిలబడి పోరాడితేనే తిరిగి అధికారం దక్కుతుంది. వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పునాదులు వేసుకోకపోతే, మళ్లీ ఓటమి తప్పదని బీఆర్ఎస్ శ్రేణులు హెచ్చరిస్తున్నాయి. నాయకులు ఇలాగే ఏసీ రూములకే పరిమితమైతే, కిందిస్థాయిలో ఉన్న బలమైన క్యాడర్ క్రమంగా వేరే పార్టీల వైపు చూసే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా గులాబీ పార్టీ పెద్దలు అలర్ట్ అయి.. నిస్తేజంగా ఉన్న అన్ని జిల్లాల అధ్యక్షులను, మాజీ మంత్రులను యాక్టివ్ చేయాలని, నిరంతరం ప్రజల్లో ఉండేలా కఠిన ఆదేశాలు జారీ చేయాలని క్షేత్రస్థాయి కార్యకర్తలు గట్టిగా కోరుకుంటున్నారు.

# టీటీడీ తరహాలో యాదాద్రిని తీర్చిదిద్దుతాం

**వేద న్యూస్, యాదాద్రి**



ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పరిధిలో తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల సముదాయ నిర్మాణానికి భూమిపూజ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి దివ్య సమక్షంలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద సంప్రదాయ పరిరక్షణతో పాటు యాదాద్రిని దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. వేద పాఠశాలతో పాటు యాదాద్రి టెంపుల్ సిటీ పరిధిలో చేపట్టనున్న పలు ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు. మొత్తం రూ.99.55 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులు యాదాద్రి రూపురేఖలను పూర్తిగా మార్చనున్నాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యాదాద్రిని తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం పేర్కొన్నారు. భక్తులకు ఆధునిక సౌకర్యాలు కల్పించడంతో పాటు వేద సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. యాదాద్రి అభివృద్ధి తెలంగాణ ఆధ్యాత్మిక చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందని సీఎం వ్యాఖ్యానించారు. రూ.43.80 కోట్ల అంచనా వ్యయంతో 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ భారీ వేద పాఠశాలలో సంప్రదాయ ఆశ్రమ గురుకుల విధానంలో 300 మంది విద్యార్థులకు వసతితో కూడిన వేద విద్య అందించనున్నారు. ఈ సముదాయంలో యాగశాలలు, హోమ మండపాలు, వేద అధ్యయన కేంద్రాలు, గోశాల వంటి ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణలో ఈ వేద పాఠశాల కీలక కేంద్రంగా నిలవనుందని పండితులు అభిప్రాయపడుతున్నారు. ఇదే కార్యక్రమంలో రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణ పనులకు కూడా భూమిపూజ జరిగింది. అలాగే కొండపై స్వామివారి నిత్య కల్యాణోత్సవాల నిర్వహణ కోసం రూ.9.87 కోట్లతో భారీ కల్యాణ మండపం నిర్మించనున్నారు. భక్తుల రాకపోకలకు మరింత సౌకర్యంగా వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి రూ.1.41 కోట్లతో రక్షణ కానోపీ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. రథశాల వైపు వాయవ్య దిశలో ఉన్న మాడవీధులకు అనుసంధానంగా రూ.1.35 కోట్ల అంచనా వ్యయంతో కొత్త మెట్ల నిర్మాణ పనులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. యాదాద్రికి రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే యాదాద్రి దేశంలోనే అత్యంత ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాల్లో ఒకటిగా నిలవనుందని భావిస్తున్నారు.

# కారుతో గుద్ది చంపేశారు

## మాసబ్‌ట్యాంక్‌లో న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ హత్య

**వేద న్యూస్, హైదరాబాద్**

వక్ఫ్ బోర్డు భూముల రక్షణ కోసం న్యాయపోరాటం చేస్తున్న ప్రముఖ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం హైదరాబాద్‌లో కలకలం రేపింది. మాసబ్‌ట్యాంక్ ప్రాంతంలో ఆయనను గుర్తుతెలియని దుండగులు కారుతో ఢీకొట్టి అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. తీవ్ర గాయాలపాలైన మొయినుద్దీన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ ఘటన మాసబ్‌ట్యాంక్ ప్రాంతంలో చోటుచేసుకుంది. రోడ్డు దాటుతున్న సమయంలో వేగంగా వచ్చిన కారు ఖాజా మొయినుద్దీన్‌ను బలంగా ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే దుండగులు అక్కడి నుంచి పారిపోయారని స్థానికులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ చికిత్స ఫలించలేదు. ఖాజా మొయినుద్దీన్ వక్ఫ్ బోర్డు భూముల పరిరక్షణ కోసం న్యాయస్థాయిలో పోరాటం చేస్తున్న వ్యక్తిగా గుర్తింపు పొందారు. అక్రమ కబ్జాలకు గురవుతున్న వక్ఫ్ భూములపై అనేక కేసులు వాదిస్తూ చురుకుగా వ్యవహరిస్తున్నారు. పలు భూవివాదాల్లో కీలక సమాచారం బయటపెట్టినట్లు కూడా తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఆయనపై దాడి జరిగి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణమైన వాహనం, దుండగుల వివరాలను గుర్తించేందుకు సమీప ప్రాంతాల్లోని సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తున్నారు. ఇది సాధారణ రోడ్డు ప్రమాదమా లేక ముందస్తు ప్రణాళికతో జరిగిన దాడా అనే కోణంలో కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. మొయినుద్దీన్ మృతితో న్యాయవాదులు, ముస్లిం సంఘాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. వక్ఫ్ భూముల రక్షణ కోసం పోరాడుతున్న వ్యక్తి అనుమానాస్పదంగా మరణించడం వెనుక నిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఘటనపై నగరవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. వక్ఫ్ భూముల వివాదాలు, అక్రమ కబ్జాల నేపథ్యంలో ఈ మరణం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి వాస్తవాలను బయటపెట్టాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## ట్రంప్‌పై ఇరాన్ వ్యంగ్య పోస్టు

- బంగ్లాదేశ్ దున్నపోతుతో ఎగతాళి చేసిన ఇరాన్
- ట్రంప్‌తో పోల్చడంతో తిండి మానేసింది అంటూ సెటైర్
- సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్న వీడియో
- బక్రీద్‌కు ముందు దున్నపోతును చూసేందుకు జనాల రద్దీ
- అమెరికా–ఇరాన్ ఉద్రిక్తతల మధ్య కొత్త వివాదం



**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**

అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్ మరోసారి అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకుని వ్యంగ్య పోస్టుతో వార్తల్లో నిలిచింది. బంగ్లాదేశ్‌లో ట్రంప్‌ను పోలి ఉన్న తెల్ల దున్నపోతుకు సంబంధించిన వీడియోను రష్యాలోని ఇరాన్ అధికారిక ‘ఎక్స్’ ఖాతాలో షేర్ చేస్తూ ఎగతాళి చేసింది. ‘ట్రంప్‌తో పోల్చడం వల్ల మనస్తాపానికి గురైన ఆ మూగజీవం ప్రస్తుతం తిండి తినడం మానేసింది’ అంటూ ఇరాన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ పోస్టుపై ప్రపంచవ్యాప్తంగా నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. బంగ్లాదేశ్‌లోని నారాయణ్‌గంజ్ జిల్లాకు చెందిన ఈ భారీ తెల్ల దున్నపోతు ఇటీవల సోషల్ మీడియాలో విపరీతంగా ప్రాచుర్యం పొందింది. సుమారు 700 కిలోల బరువున్న ఈ దున్నపోతు తలపై ఉన్న జుట్టు, ముఖ ఆకృతి డొనాల్డ్ ట్రంప్‌ను పోలి ఉన్నాయని పలువురు నెటిజన్లు వ్యాఖ్యానించారు. దీంతో దాని యజమాని సరదాగా ఆ దున్నపోతుకు “డొనాల్డ్ ట్రంప్” అని పేరు పెట్టాడు. ప్రస్తుతం బక్రీద్ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో ఈ దున్నపోతును చూసేందుకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు. సందర్శకులు సెల్ఫీలు దిగుతూ వీడియోలు, ఫోటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్నారు. అయితే బక్రీద్ సందర్భంగా దున్నపోతును బలివ్వాల్సి ఉంటుందని యజమాని చెప్పడంతో పలువురు జంతు ప్రేమికులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన అంతర్జాతీయ రాజకీయాలతో పాటు సోషల్ మీడియాలో కూడా పెద్ద చర్చకు దారితీసింది.

# పాము కాటేసినా ధైర్యం కోల్పోకుండా..

**- డబ్బాలో బంధించి ఆస్పత్రికి తీసుకొచ్చిన యువకుడు**



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ మొండ్రాయి గ్రామానికి చెందిన అనుముల ప్రవీణ్ తన ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్న సమయంలో పాము కాటుకు గురయ్యాడు. అయితే ఎలాంటి భయాందోళనకు గురికాకుండా స్వయంగా ప్రథమ చికిత్స చేసుకుని, తనను కరిచిన పామును చంపకుండా ఒక డబ్బాలో బంధించి చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తీసుకువచ్చాడు. ఆస్పత్రి సిబ్బందికి పామును చూపించడంతో వైద్యులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ.. ప్రాణికోటిలో పాము కూడా ఒక జీవి.. దాన్ని చంపడం సరికాదు అని తెలిపారు. పాము కాటుకు గురైనప్పటికీ ధైర్యంగా వ్యవహరించి, పామును చంపకుండా తీసుకువచ్చిన ప్రవీణ్‌పై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల పాత్ర దైవసమానం




**- 'ఫిట్ తెలంగాణ - హెల్తీ తెలంగాణ'లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**
**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**వేద న్యూస్, హైదరాబాద్:**

ప్రజల ప్రాణాలను కాపాడే వైద్య వృత్తి దేవుని తర్వాత అత్యంత గౌరవనీయమైనదని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన జీ తెలుగు న్యూస్ హెల్త్ కేర్ అవార్డ్స్-2026 కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, వైద్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న వైద్యులు, ఆసుపత్రులు, ఆరోగ్య సేవా సంస్థలను సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద ప్రజల పట్ల వైద్యులు సేవాభావంతో వ్యవహరించాలని సూచించారు. నాణ్యమైన వైద్య సేవలే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాదిగా నిలుస్తాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను "ఫిట్ తెలంగాణ హెల్తీ తెలంగాణ"గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకుని వ్యాయామం, సమతుల్య ఆహారం, క్రమశిక్షణతో జీవించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఆరోగ్య రంగంలో ఉత్తమ సేవలు అందిస్తున్న వారిని గుర్తించి సత్కరించడం అభినందనీయమన్నారు.

# పంటలపై రసాయన వినియోగం తగ్గించాలి



**- సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన**
**- దస్తగిరిపల్లిలో ఏరువాక కార్యక్రమం**

**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండలం దస్తగిరిపల్లి గ్రామంలో నిర్వహించిన ఏరువాక రైతు సాగుబడి కార్యక్రమంలో సర్పంచ్ పులి రమేష్ అధ్యక్షతన వ్యవసాయ అధికారి బన్న రజిత రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. మొక్కజొన్న, వరి పంట కోత అనంతరం చొప్పను కాల్చకుండా రోటోవేటర్‌తో దున్నించి సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా వెస్ట్ డికంపోజర్ ఉపయోగించాలని సూచించారు. దీంతో నేలలో సేంద్రియ కార్బన్ శాతం పెరుగుతుందని తెలిపారు. పచ్చిరొట్టె ఎరువులైన జీలుగ, పెసర్లు వేసి వరి పొలాల్లో దున్నుకోవాలని, దీని వల్ల రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుందని చెప్పారు. పంట మార్పిడి, పప్పు జాతుల సాగు పెంచుకోవడం ద్వారా ఖర్చులు తగ్గడంతో పాటు నేల సారం పెరుగుతుందని వివరించారు. పత్తి, మిరప, మక్క చేనుల్లో పప్పుజాతి మొక్కలను అంతరపంటగా సాగు చేయాలని, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శివకుమార్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

**- ఎంపీడీవోకు మాజీ సర్పంచుల వినతి**



**వేద న్యూస్, నడికూడ:**

మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ శనివారం నడికూడ మండల ఫోరం అధ్యక్షుడు తిప్పర్తి సాంబశివ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవో ఆర్. రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పైపులైన్లు, లైటింగ్, ట్రాక్టర్లు, ట్యాంకర్లు, రైతు వేదికలు తదితర అభివృద్ధి పనులు అప్పులు తెచ్చి చేపట్టామని తెలిపారు. అయితే 2023-24 కాలానికి సంబంధించిన పెండింగ్ బిల్లులు విడుదల కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే విడుదల చేసి బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఊర రవీందర్ రావు, బోట్ల సంధ్య రవీందర్, సదానందం, రమేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ చేయాలి

**- డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన ఉప సర్పంచ్**

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలం మైలారం గ్రామంలో ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణలపై ఉప సర్పంచ్ దైనంపెల్లి సుమన్ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సారెస్పీ 31 డీబీఎం కెనాల్‌కు ఆనుకుని ఉన్న సీతకుంటకు సంబంధించిన ప్రభుత్వ భూమి సర్వే నంబర్లు 540, 542, 543లను మాజీ ఎస్సారెస్పీ చైర్మన్ చల్ల సంజీవరెడ్డి తన కుమారుడు చల్ల తిరుపతిరెడ్డి పేరున అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణలు గ్రామంలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ భూమిని అధికార దుర్వినియోగంతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సర్వే



నంబర్లపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి, ప్రభుత్వ భూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

**- ఎండల వేళ జాగ్రత్తలు పాటించాలని సూచన**

**వేద న్యూస్, శాయంపేట:**



హనుమకొండ జిల్లా శాయంపేట మండలం తహరాపూర్ (మందారిపేట) గ్రామంలోని పోచమ్మకుంట, తురుకకుంట ప్రాంతాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గ్రామ సర్పంచ్ కుక్కల సరోజన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయం 5 గంటల నుంచి 10 గంటల లోపే పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్మికులకు చల్లటి తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఏపీఓ అనితతో మాట్లాడిన సర్పంచ్, కూలీల వేతనాలు త్వరగా జమ అయ్యేలా చూడాలని కోరారు. జాబ్ కార్డులు తొలగిపోవడంతో పేద కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, వారికి వెంటనే పని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అజయ్, ఉప సర్పంచ్ రావుల శ్రీనివాస్, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# విత్తన దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు

**- నాణ్యమైన విత్తనాలే కొనుగోలు చేయాలని అధికారుల సూచన**



**వేద న్యూస్, అయిజ:**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలో విత్తన దుకాణాలపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు, సాంకేతిక వ్యవసాయ అధికారి శ్రీ సుబ్బారెడ్డి, మండల వ్యవసాయ అధికారి జనార్దన్, అయిజ ఎస్సై కేటీ మల్లేష్ సంయుక్తంగా అయిజ పట్టణంతో పాటు వెంకటాపురం స్టేజి వద్ద ఉన్న విత్తన దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇచ్చి మాత్రమే విత్తనాలు విక్రయించాలని దుకాణదారులకు సూచించారు. లూజు విత్తనాలు లేదా కాలం చెల్లిన విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేసి బిల్లులను భద్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు.

# పదో తరగతి విద్యార్థులకు సన్మానం

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో రైడ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమంలో భాగంగా పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ విద్యార్థులకు మెమొంటోలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మరింత కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కట్ట శ్రీనివాస్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, రైడ్స్ అధ్యక్షులు కరోల్ల కృష్ణ ప్రసాద్, కార్యదర్శి పార్వతి శేఖర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రోడ్ల మరమ్మతుల్లో అలుపెరగని సేవ

**- గుంతలు పూడ్చుతూ ప్రజలకు ఊరటనిస్తున్న సుధాకర్**

**వేద న్యూస్, అయిజ:**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం తాండ్రపాడు గ్రామానికి చెందిన సుధాకర్ గౌడ్ గ్రామ ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుంటూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో రహదారులపై గుంతలు ఏర్పడిన ప్రతిసారి వాటిని స్వయంగా పూడ్చిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. సుదీర్ఘకాలంగా ప్రజాసేవలో నిమగ్నమైన ఆయన గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. గ్రామ సర్పంచ్‌గా సేవలందించిన సుధాకర్ గౌడ్, ప్రజలకు సేవ చేయడమే తనకు నిజమైన సంతృప్తినిస్తుందని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా ఆయన సేవాభావాన్ని అభినందిస్తున్నారు.



## ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

**- సీఐటీయూ నాయకులు ఎస్. అజయ్**



**వేద న్యూస్, దేవరకద్ర/ఆత్మకూర్:**

వనపర్తి జిల్లా సీఐటీయూ నాయకులు ఎస్. అజయ్, జిల్లా సహాయక కార్యదర్శి ఎస్. రాజు శనివారం ఆత్మకూర్ మండలంలోని బాలకిష్టాపూర్ బౌన్సింగ్ తాండాలో మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శించారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో ఫోటో క్యాప్చర్ విధానం వల్ల అడవుల్లో నెట్‌వర్క్ సమస్యల కారణంగా కూలీలు పని కోల్పోతున్నారని తెలిపారు. ఆఫ్‌లైన్ హాజరు అవకాశం కల్పించాలని కోరారు. అలాగే పని ప్రదేశాల్లో మంచినీరు, టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని, రోజుకూలి రూ.600కు పెంచి ఏడాదికి 200 రోజుల ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మన్యం నాయక్, సాంతమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వానొస్తే కష్టాలే..!



- పెద్దవాగు బ్రిడ్జి ఎత్తు తక్కువగాద ఉడదంతో ప్రజల అవస్థలు
- వాగు పొంగితే ఆరు గ్రామాల రాకపోకలు బంద్
- అత్యవసర వేళల్లో ప్రాణాలతో పోరాటం
- శాశ్వత పరిష్కారం కోరుతున్న గ్రామస్తులు

**వేద న్యూస్, గద్వాల్ ప్రతినిధి:**

మండలంలోని పెద్దవాగు బ్రిడ్జి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ప్రతి వర్షాకాలంలో బ్రిడ్జిపై ఐదు అడుగుల మేర వరద నీరు చేరడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాలకు చెందిన ఆరు గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చినా, విద్యార్థులు పాఠశాలలకు చేరుకోవాలన్నా ప్రాణాలను పణంగా పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. వరద నీరు ఉధృతంగా ప్రవహించే సమయంలో ప్రజలు గంటల తరబడి బ్రిడ్జి వద్దే నిలిచిపోవాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది ఇదే సమస్య ఎదురవుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే పెద్దవాగు బ్రిడ్జి ఎత్తు పెంపు పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## హామీల అమలుకు ఇంటింటికీ దరఖాస్తుల పంపిణీ

**- సంక్షేమ పథకాల కోసం సీపీఐ నేతల ప్రచారం**

**వేద న్యూస్, నల్లబెల్లి:**

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం సీపీఐ నాయకులు నల్లబెల్లి మండల కేంద్రంలో ఇంటింటికీ తిరుగుతూ ఉచితంగా దరఖాస్తులను పంపిణీ చేశారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గౌడ కాలనీలో పలువురు మహిళలకు దరఖాస్తు ఫారాలు అందజేశారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2500, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల సాయం, నిరుద్యోగ భృతి, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, రాజీవ్ యువ వికాసం వంటి పథకాల కోసం ఈ దరఖాస్తులను అందజేస్తున్నట్లు నాయకులు తెలిపారు. మే 26న ఎంపీడీవో కార్యాలయం ద్వారా ముఖ్యమంత్రికి పంపేందుకు ప్రతి ఒక్కరూ దరఖాస్తులతో రావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బట్టు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



## యువతకు క్రికెట్ కిట్ల పంపిణీ

**- కోనేరు చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం**



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెరగడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని కటిక రామరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ప్రశాంత్ గౌడ్, కటిక రామరాజు, ఆలపాటి హరికృష్ణ, రాజా వరప్రసాద్, దావోజీ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరం

- కంఫర్ట్ జోన్ దాటితేనే విజయాలు సాధ్యం
- యువత ప్రతిభకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది
- కలెక్టర్ దివాకర్



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఆరోగ్యకరమైన జీవితానికి క్రీడలు ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన యువజన, క్రీడల కార్యక్రమంలో ఆయన అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ సాధన-ఉద్యోగ అవకాశాల అనుసంధానం జాబ్ మేళాలో ఎంపికైన 618 మంది అభ్యర్థులకు ప్రొవిజనల్ ఆఫర్ లెటర్లు అందజేశారు. అలాగే సీఎం కప్-2026 రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన 72 మంది క్రీడాకారులను సన్మానించారు. మొత్తం 433 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించినట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం యువత అనేక క్రీడల్లో ప్రతిభ కనబరుస్తోందని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా అందిస్తాయని అన్నారు. ఆరోగ్యంపై పెట్టుబడి పెట్టడం అత్యంత ముఖ్యమని సూచించారు. ఖమ్మం జిల్లాలో క్రీడలకు మంచి మౌలిక వసతులు, కోచ్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యువత తమ ప్రతిభను గుర్తించి కష్టపడి పనిచేస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఉద్యోగం సాధించడం మొదటి అడుగేనని, కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జాబ్ మేళాలో ఎంపికైన యువతకు, రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ప్రతి విజయం భవిష్యత్తుకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ సునీల్ రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి మాధవి, కోచ్‌లు, క్రీడాకారులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగ సాధన మేళా విజయవంతం



**వేద న్యూస్ పెద్దపల్లి :**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన "ఉద్యోగ సాధన మేళా" శనివారం విజయవంతంగా ముగిసింది. పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల యువతి, యువకుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని టాస్క్, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో అనేక ఉపాధి అవకాశాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ సూచించారు. ఉద్యోగ సాధన మేళాలో వివిధ రంగాలకు చెందిన సంస్థలు పాల్గొని అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. అర్హతలు, ప్రతిభ ఆధారంగా ఎంపికైన అభ్యర్థులకు కలెక్టర్ స్వయంగా నియామక పత్రాలను అందజేసి అభినందించారు. ఉద్యోగాలు పొందిన యువత ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా యూత్ పార్లమెంట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక మెమెంటోలు అందజేసి కలెక్టర్ అభినందించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఎ.సురేష్, జిల్లా ఎంప్లాయ్మెంట్ అధికారి ఎం.రాజశేఖర్, జీఎం డీఐసీ కీర్తికాంత్, టాస్క్ అధికారులు, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరిని కలెక్టర్ అభినందించారు.

## జొన్నల కొనుగోళ్ల వేగవంతానికి ఆదేశాలు

**వేద న్యూస్ ఆదిలాబాద్ :**



జిల్లాలో జొన్నల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి నిర్వహించిన అత్యవసర గూగుల్ మీట్‌లో కొనుగోళ్లు, రవాణా ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. జొన్నల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి రైతులకు త్వరితగతిన చెల్లింపులు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులు కేంద్రాల వద్ద ఎక్కువసేపు వేచి ఉండకుండా తగిన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. రవాణా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన జొన్నలను గోదాములకు వేగంగా తరలించేలా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సూచించారు. లారీల కొరత లేదా ఇతర కారణాలతో జాప్యం జరగకుండా సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత పాటిస్తూ రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తూకం, నాణ్యత తనిఖీలు, నిల్వ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ గూగుల్ మీట్‌లో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ ఆర్.ఎస్.చిత్రు, జెడ్పీ సీఈఓ రవి, డీఆర్‌డీఓ రవీందర్, జిల్లా వ్యవసాయ అధికారి, మార్క్‌ఫెడ్ డీఎం మహేష్ కుమార్, మార్కెటింగ్ ఏడీ గజానన్, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, డీసీఎస్ఓ నందిని, సివిల్ సప్లైస్ డీఎం సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

# అధిక వేడి..

**– రాబోయే కాలంలో జీవనం మరింత కష్టమా?**



**వేద న్యూస్ డెస్క్:**

దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఇప్పుడు సాధారణ వేసవి పరిస్థితులుగా కనిపించడం లేదు. ప్రతి ఏడాది ఎండలు మరింత తీవ్రంగా మారుతూ ప్రజల జీవనశైలిని పూర్తిగా మార్చేస్తున్నాయి. ఒకప్పుడు మధ్యాహ్న సమయంలో మాత్రమే భరించలేని వేడి ఉండేది. ఇప్పుడు ఉదయం నుంచే మండే ఎండలు మొదలై రాత్రివేళల్లో కూడా వేడి తగ్గని పరిస్థితులు కనిపిస్తున్నాయి. వాతావరణ మార్పులు, నగరీకరణ, చెట్ల నరికివేత, పెరుగుతున్న కాలుష్యం కలిసి ఈ పరిస్థితులను మరింత ప్రమాదకరంగా మార్చుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత వాతావరణ శాఖ ఇప్పటికే అనేక రాష్ట్రాలకు తీవ్ర ఉష్ణతరంగ హెచ్చరికలు జారీ చేసింది. ఉత్తర, మధ్య, తూర్పు భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు నలభై ఐదు డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నలభై ఏడు డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని పిడుగురాళ్లలో ఈ ఏడాది అత్యధికంగా నలభై ఎనిమిది డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత నమోదైనట్లు నివేదికలు చెబుతున్నాయి.

వేడి ప్రభావం కేవలం బయట తిరిగేవారిపైనే కాదు. ఇళ్లలో ఉన్నవారిపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. రాత్రివేళల్లో కూడా ఉష్ణోగ్రతలు అధికంగానే ఉండటంతో ప్రజలకు సరైన నిద్ర దొరకడం లేదు. గాలి తేమ పెరగడం వల్ల చెమట ఎక్కువై శరీరం త్వరగా అలసిపోతోంది. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు, అనారోగ్య సమస్యలతో బాధపడేవారిపై ఈ పరిస్థితులు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. అధిక వేడి కారణంగా విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది. చల్లబరిచే పరికరాల వినియోగం పెరగడంతో విద్యుత్ వ్యవస్థలపై తీవ్రమైన ఒత్తిడి ఏర్పడుతోంది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. విద్యుత్ అవసరాలు రికార్డు స్థాయికి చేరినట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడిస్తున్నాయి. వ్యవసాయ రంగంపైనా వేడి తీవ్ర ప్రభావం చూపుతోంది. పంటలు ఎండిపోవడం, నీటి కొరత పెరగడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల భవిష్యత్తులో తాగునీటి సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఉదయం, సాయంత్రం మాత్రమే బయటకు వస్తూ జీవనశైలిని మార్చుకుంటున్నారు.

వాతావరణ మార్పులు ఇప్పుడు భవిష్యత్తు ప్రమాదం కాదు, ప్రస్తుత వాస్తవమనే పరిస్థితి కనిపిస్తోంది. శాస్త్రవేత్తలు చెబుతున్నట్లుగా మానవ చర్యల వల్లే ఈ తీవ్ర ఉష్ణ పరిస్థితులు మరింత పెరుగుతున్నాయి. చెట్ల సంఖ్య తగ్గిపోవడం, కాంక్రీట్ భవనాలు పెరగడం, వాహనాల కాలుష్యం అధికమవడం వల్ల నగరాలు వేడి దీవుల్లా మారుతున్నాయి. ఆరోగ్య శాఖలు కూడా ఇప్పటికే అప్రమత్తమవుతున్నాయి. వడదెబ్బ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయడం, దాహ నివారణ ద్రావణాలు నిల్వ ఉంచడం, ప్రజలకు సూచనలు ఇవ్వడం వంటి చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ ప్రజల్లో ఇంకా సరైన అవగాహన పూర్తిగా పెరగలేదని నిపుణులు చెబుతున్నారు. చాలామంది మధ్యాహ్న వేళల్లో కూడా బయట తిరగడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు.

ఇప్పుడు ప్రశ్న ఒక్కటే. రాబోయే పదేళ్లలో పరిస్థితి ఇంకా ఎంత తీవ్రమవుతుంది? ఇప్పటికే ప్రతి ఏడాది ఎండ తీవ్రత పెరుగుతుండగా భవిష్యత్తులో జీవనం మరింత కఠినంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. నీరు, విద్యుత్, ఆరోగ్యం, ఆహార భద్రత వంటి రంగాలన్నింటిపైనా వేడి ప్రభావం పడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజల జీవితం మరింత భారంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటడం, నీటి వినియోగాన్ని తగ్గించడం, అవసరం లేని విద్యుత్ వినియోగాన్ని నియంత్రించడం వంటి చిన్న చర్యలు కూడా పెద్ద మార్పుకు దారితీస్తాయి. పట్టణాల్లో పచ్చదనం పెంచకపోతే భవిష్యత్తులో నగర జీవనం మరింత కష్టసాధ్యంగా మారే ప్రమాదం ఉంది. అధిక వేడి ఇప్పుడు కేవలం ఒక ఋతు సమస్య కాదు. అది ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, జీవనశైలిని ప్రభావితం చేసే పెద్ద సవాలుగా మారుతోంది. ఇప్పటికైనా ప్రకృతిని కాపాడే చర్యలు వేగంగా చేపట్టకపోతే రాబోయే తరాలకు భరించలేని పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం కనిపిస్తోంది. వడదెబ్బ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయడం, దాహ నివారణ ద్రావణాలు నిల్వ ఉంచడం, ప్రజలకు సూచనలు ఇవ్వడం వంటి చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ ప్రజల్లో ఇంకా సరైన అవగాహన పూర్తిగా పెరగలేదని నిపుణులు చెబుతున్నారు. చాలామంది మధ్యాహ్న వేళల్లో కూడా బయట తిరగడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు.

ఇప్పుడు ప్రశ్న ఒక్కటే. రాబోయే పదేళ్లలో పరిస్థితి ఇంకా ఎంత తీవ్రమవుతుంది? ఇప్పటికే ప్రతి ఏడాది ఎండ తీవ్రత పెరుగుతుండగా భవిష్యత్తులో జీవనం మరింత కఠినంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. నీరు, విద్యుత్, ఆరోగ్యం, ఆహార భద్రత వంటి రంగాలన్నింటిపైనా వేడి ప్రభావం పడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజల జీవితం మరింత భారంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటడం, నీటి వినియోగాన్ని తగ్గించడం, అవసరం లేని విద్యుత్ వినియోగాన్ని నియంత్రించడం వంటి చిన్న చర్యలు కూడా పెద్ద మార్పుకు దారితీస్తాయి. పట్టణాల్లో పచ్చదనం పెంచకపోతే భవిష్యత్తులో నగర జీవనం మరింత కష్టసాధ్యంగా మారే ప్రమాదం ఉంది. అధిక వేడి ఇప్పుడు కేవలం ఒక ఋతు సమస్య కాదు. అది ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, జీవనశైలిని ప్రభావితం చేసే పెద్ద సవాలుగా మారుతోంది. ఇప్పటికైనా ప్రకృతిని కాపాడే చర్యలు వేగంగా చేపట్టకపోతే రాబోయే తరాలకు భరించలేని పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం కనిపిస్తోంది.

# అమీన్‌పూర్‌లో వరుస దొంగతనాల కేసు ఛేదన

- నిందితుడు ఎర్ర శివ అరెస్ట్
- 45 తులాల బంగారు ఆభరణాల స్వాధీనం
- బాధితులకు ఆభరణాల అప్పగింత
- నిందితుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు



**వేద న్యూస్ హైదరాబాద్ :**

అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి కేసును ఛేదించారు. మండల్లా శివ అలియాస్ ఎర్ర శివ అనే నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు గత కొంతకాలంగా అమీన్‌పూర్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రజల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని బంగారు ఆభరణాలు చోరీ చేస్తున్నాడని విచారణలో తేలినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక నిఘా, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 45 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆభరణాల విలువ భారీగా ఉంటుందని అధికారులు తెలిపారు. చోరీకి గురైన ఆభరణాలను గుర్తించి బాధితులకు అప్పగించినట్లు వెల్లడించారు. దొంగతనాల కేసులను ఛేదించడంలో పోలీసులు సమర్థవంతంగా పనిచేశారని అధికారులు పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం ప్రత్యేక బృందాలతో నేరస్థులపై నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులు స్వాధీనం చేసిన బంగారు ఆభరణాలు తిరిగి అందుకోవడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. కేసును త్వరితగతిన ఛేదించి ఆభరణాలు అప్పగించిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద కదలికలపై వెంటనే సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు. జిల్లాలో నేరాల నియంత్రణకు పోలీసులు నిరంతరం చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**వేద న్యూస్ హైదరాబాద్ :**

ఉప్పల్ మండలానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం మల్లాపూర్‌లోని వీఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మొత్తం 233 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ పథకాల కింద ఆర్థిక సహాయం అందించారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఈ పథకాలు ఎంతో దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పెద్ద అండగా నిలుస్తున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ పథకాలు సామాజిక భద్రతకు మంచి ఉదాహరణలని అన్నారు. పేదింటి పెళ్లిళ్లలో ఆర్థిక భారం తగ్గించేందుకు ఈ పథకాలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అదేవిధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తులం బంగారం పథకాన్ని కూడా అమలు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పేద కుటుంబాలకు మరింత మేలు జరిగేలా సంక్షేమ కార్యక్రమాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర సమయంలో ఈ ఆర్థిక సహాయం తమకు ఎంతో ఉపయుక్తంగా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల పేద కుటుంబాలకు ఊరట లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్వో ఫూల్ సింగ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల సంక్షేమం కోసం ఇటువంటి కార్యక్రమాలు కొనసాగుతాయని నాయకులు తెలిపారు.

# ప్రీ స్కూల్ ప్రారంభం



**వేద న్యూస్ హైదరాబాద్ :**

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లి రేణుక ఎల్లమ్మ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన “ఫస్ట్ క్రై స్మార్ట్ బీస్” ప్రీ స్కూల్, డే కేర్ స్కూల్‌ను బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ శనివారం ప్రారంభించారు. రంజిత్ గౌడ్ పాలమాకుల, సుమ శ్రీ బండారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విద్యాసంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తు బలోపేతానికి ప్రాథమిక విద్య అత్యంత కీలకమన్నారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్యాసంస్థలు పిల్లల్లో సృజనాత్మకత, మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షిత వాతావరణం కల్పించడం అవసరమన్నారు. స్కూల్‌లో ఏర్పాటు చేసిన తరగతి గదులు, డే కేర్ సౌకర్యాలు, విద్యా విధానాలను ఎమ్మెల్యే పరిశీలించారు. చిన్నారుల అభివృద్ధికి అనుగుణంగా అన్ని వసతులు కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యా రంగంలో కొత్త ఆలోచనలతో ముందుకు రావడం సమాజాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ జోనల్ మేనేజర్ రవి, అకాడమిక్ మేనేజర్ కళ్యాణి, ఆపరేషన్ హెడ్ శ్రీనివాస్, పవన్, సెంటర్ మేనేజర్లు శ్వేత కోగంటి, ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు. విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేందుకు కట్టుబడి పనిచేస్తామని వారు తెలిపారు. అదేవిధంగా నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్ ఆగం రాజు, మాజీ కౌన్సిలర్ శంబిపూర్ కృష్ణ, కార్పొరేటర్లు రవి కిరణ్, బాలాజీ నాయక్, చందు ముదిరాజ్, కో ఆప్షన్ సభ్యులు సలీం, సతీష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పాణ్యంలో మెగా జాబ్ మేళా నిర్వహణ

- నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పన
- కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి
- భారీ సంఖ్యలో పాల్గొన్న యువతి, యువకులు
- నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం




**వేద న్యూస్ కర్నూలు :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పాణ్యం నియోజకవర్గ నిరుద్యోగ యువతి, యువకుల కోసం నిర్వహించిన మెగా జాబ్ మేళా శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతను ఉద్యోగాలకు సిద్ధం చేసి వారి భవిష్యత్తును బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. యువత తమ ప్రతిభను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మెగా జాబ్ మేళాలో పలు ప్రముఖ సంస్థలు పాల్గొని ఉద్యోగ అవకాశాలను అందించాయి. వివిధ రంగాలకు సంబంధించిన ఉద్యోగాల కోసం యువతి, యువకులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. తమ అర్హతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను పరిశీలిస్తూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉద్యోగ అవకాశాల కోసం గ్రామీణ ప్రాంత యువత నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నియోజకవర్గ స్థాయిలోనే జాబ్ మేళాలు నిర్వహించడం అభినందనీయమని పాల్గొన్న వారు పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిరుద్యోగ సమస్య తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. యువతకు కేవలం ఉద్యోగాలు మాత్రవే కాకుండా నైపుణ్యాభివృద్ధి శిక్షణలు కూడా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారులు తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలు



నిర్వహిస్తూ ఉపాధి అవకాశాలను పెంచుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సంస్థల ప్రతినిధులు, స్థానిక నాయకులు, భారీ సంఖ్యలో యువతి, యువకులు పాల్గొన్నారు. మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని మంచి అవకాశాలను పొందాలని నాయకులు యువతకు సూచించారు.

వేద న్యూస్

ఆదివారం మే 24 , 2026

# బ్రౌన్ రైస్ వర్సెస్ వైట్ రైస్.. ఏది ఆరోగ్యానికి మంచిది?

- సంపూర్ణ ధాన్యంగా బ్రౌన్ రైస్
- మెత్తదనంతో ఆకట్టుకునే వైట్ రైస్
- అవసరాన్ని బట్టి ఎంపిక చేసుకోవాలని నిపుణుల సూచన



**వేద న్యూస్ డెస్క్:**

మన రోజువారీ ఆహారంలో బియ్యం కీలక భాగంగా ఉంటుంది. అయితే ప్రస్తుతం ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో బ్రౌన్ రైస్, వైట్ రైస్‌లలో ఏది మంచిదనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. ఈ రెండు రకాల బియ్యాలకు ప్రత్యేక లక్షణాలు ఉన్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. బ్రౌన్ రైస్‌ను సంపూర్ణ ధాన్యంగా పరిగణిస్తారు. ఇందులో గింజపై ఉండే పై పొర పూర్తిగా తొలగించరు. అందువల్ల ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. జీర్ణక్రియ నెమ్మదిగా జరిగి ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంచడంలో ఇది సహాయపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా నియంత్రించడంలో కూడా బ్రౌన్ రైస్ ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. వైట్ రైస్‌లో గింజపై ఉండే పొర తొలగించబడుతుంది. అందువల్ల ఇది మెత్తగా ఉండి త్వరగా ఉడుకుతుంది. తినడానికి రుచిగా ఉండటంతో చాలా మంది దీనినే ఇష్టపడుతుంటారు. జీర్ణం సులభంగా కావడం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, జీర్ణ సమస్యలు ఉన్నవారికి వైట్ రైస్ అనుకూలంగా భావిస్తారు. అయితే వైట్ రైస్‌లో ఫైబర్ తక్కువగా ఉండటం వల్ల త్వరగా ఆకలి వేయొచ్చు. అలాగే అధికంగా తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరిగే అవకాశముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. బ్రౌన్ రైస్‌తో పోలిస్తే పోషకాలు కూడా తక్కువగా ఉంటాయని చెబుతున్నారు. బరువు తగ్గాలనుకునేవారు, మధుమేహ సమస్యలతో బాధపడేవారు బ్రౌన్ రైస్‌ను ఆహారంలో చేర్చుకోవడం మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు క్రీడాకారులు లేదా త్వరగా శక్తి అవసరమయ్యే వారు వైట్ రైస్‌ను కూడా తీసుకోవచ్చని అంటున్నారు. ఆరోగ్య పరిస్థితి, జీవనశైలి, శారీరక అవసరాలను బట్టి బియ్యం ఎంపిక చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఏ రకమైన బియ్యమైనా పరిమిత మోతాదులో తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని సూచిస్తున్నారు.

# నిమ్మకాయతో మోకాళ్ల నొప్పులకు ఉపశమనం..



- సహజ చిట్కాలవైపు ప్రజల దృష్టి
- నిమ్మకాయ వినియోగంపై చర్చ
- వ్యాయామం కూడా తప్పనిసరి

**వేద న్యూస్ డెస్క్:**

మోకాళ్ల నొప్పులు ప్రస్తుతం అన్ని వయసుల వారిలో కనిపిస్తున్నాయి. ఎక్కువసేపు కూర్చోవడం, వ్యాయామం లేకపోవడం, బరువు పెరగడం వంటి కారణాలతో చాలామంది కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మందులతో పాటు సహజ పద్ధతులపై కూడా ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అలాంటి ఇంటి చిట్కాల్లో నిమ్మకాయ వినియోగం గురించి ఇప్పుడు ఎక్కువగా చర్చ జరుగుతోంది. నిమ్మకాయలో ఉండే విటమిన్ సీ, యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి కొంత ఉపశమనం ఇవ్వవచ్చని పలువురు చెబుతున్నారు. కొంతమంది నిమ్మకాయను మధ్యలో కోసి మోకాళ్లపై మెల్లగా రుద్దుతున్నారు. మరికొందరు గోరువెచ్చని నువ్వుల నూనెలో కొద్దిగా నిమ్మరసం కలిపి మోకాళ్లకు మర్దన చేస్తున్నారు. ఇంకొందరు నిమ్మ తొక్కలను గుడ్డలో కట్టి కొద్దిసేపు మోకాళ్లపై ఉంచుతున్నారు. ఉదయం గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలిపి తాగడం వల్ల శరీరానికి తేమ అందుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బరువు నియంత్రణలో ఉండటానికి కూడా ఇది సహాయపడవచ్చని పేర్కొంటున్నారు. బరువు తగ్గితే మోకాళ్లపై ఒత్తిడి తగ్గే అవకాశం ఉంటుంది. అయితే నిమ్మకాయ ఒక్కటే మోకాళ్ల నొప్పిని పూర్తిగా తగ్గించే ఔషధం కాదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. చర్మం సున్నితంగా ఉండేవారు నిమ్మరసం నేరుగా రాస్తే మంట లేదా దురద రావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే ముందుగా కొద్దిగా పరీక్షించి ఉపయోగించడం మంచిదని సూచిస్తున్నారు. మోకాళ్లలో తీవ్రమైన నొప్పి, వాపు, నడవలేని పరిస్థితి ఉంటే ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడకుండా వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు. మోకాళ్ల ఆరోగ్యానికి సరైన ఆహారం, తేలికపాటి వ్యాయామం, నడక చాలా అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. ప్రతిరోజూ కొంతసేపు నడవడం, కాళ్లకు సంబంధించిన వ్యాయామాలు చేయడం వల్ల కీళ్ల బలం మెరుగుపడుతుందని చెబుతున్నారు. సహజ చిట్కాలు కొంత ఉపశమనం ఇవ్వొచ్చేమో కానీ శాశ్వత పరిష్కారం కోసం సరైన వైద్య సలహా తీసుకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# ఎండాకాలంలో పిల్లలకు పప్పు, సాంబార్ మంచిదేనా?

**వేద న్యూస్ డెస్క్:**




ఎండాకాలంలో పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ఎక్కువగా శ్రద్ధ తీసుకుంటున్నారు. అధిక వేడి కారణంగా పిల్లల్లో ఆకలి తగ్గడం, నీరసం, అలసట వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. దీంతో వేసవిలో పిల్లలకు ఎలాంటి ఆహారం పెట్టాలి అనే అంశంపై చాలామంది ఆలోచిస్తున్నారు. ఆరోగ్య నిపుణుల ప్రకారం పప్పు, సాంబార్ పిల్లలకు మంచి ఆహారంగా పరిగణించవచ్చు. పప్పులో ప్రోటీన్లు ఉండటంతో శరీరానికి శక్తి అందే అవకాశం ఉంటుంది. సాంబార్‌లో కూరగాయలు కలిపితే మరింత పోషకాలు అందుతాయని నిపుణులు చెబుతున్నారు. అయితే ఎక్కువ మసాలా, కారం లేకుండా తేలికగా తయారు చేయడం మంచిదని సూచిస్తున్నారు. వేసవిలో దోసకాయ, బీరకాయ, సొరకాయ, బుడమకాయ, గుమ్మడికాయ వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే కూరగాయలు పిల్లలకు ఉపయోగపడవచ్చని నిపుణులు చెబుతున్నారు. క్యారెట్, బీట్‌రూట్, టమాటా వంటి కూరగాయలు కూడా ఆహారంలో ఉండాలని సూచిస్తున్నారు. ఇవి శరీరానికి అవసరమైన విటమిన్లు అందించడంలో సహాయపడవచ్చని పేర్కొంటున్నారు. పెరుగు, మజ్జిగ వంటి ఆహారాలను కూడా పిల్లల భోజనంలో భాగం చేయడం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇవి శరీరానికి చల్లదనం ఇవ్వడంలో సహాయపడవచ్చని పేర్కొంటున్నారు. అలాగే పండ్లు, కొబ్బరి నీరు వంటి సహజ ఆహారాలు కూడా వేసవిలో పిల్లలకు ఉపయోగపడవచ్చని సూచిస్తున్నారు. చల్లని పానీయాలు, ఎక్కువ నూనె పదార్థాలు, బయట దొరికే జంక్ ఫుడ్ తగ్గించడం మంచిదని వైద్యులు చెబుతున్నారు. పిల్లలు రోజంతా తగినంత నీళ్లు తాగుతున్నారా లేదా అన్న విషయంపై కూడా తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. సమతుల ఆహారం, సరైన నిద్ర, పరిశుభ్రత ఉంటే వేసవిలో పిల్లల ఆరోగ్యం మెరుగ్గా ఉండే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

# విన్‌ఫాస్ట్ కొత్త తరం వీఎఫ్8 ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ విడుదల..

**వేద న్యూస్ డెస్క్:**

వియత్నాం దేశానికి చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ విన్‌ఫాస్ట్ తన కొత్త తరం వీఎఫ్8 ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని స్వదేశంలో అధికారికంగా విడుదల చేసింది. ఈ అప్‌డేటెడ్ మోడల్‌లో అనేక కొత్త ఫీచర్లు, మార్పులు, ఆధునిక డిజైన్ అంశాలు జోడించడంతో వాహన ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. మునుపటి మోడల్‌తో పోలిస్తే ఇది మరింత శక్తివంతంగా, స్టైలిష్‌గా తయారైందని కంపెనీ వెల్లడించింది. కొత్త వీఎఫ్8లో ముందుభాగంలో ఇంటిగ్రేటెడ్ డీఆర్‌ఎల్‌లతో కూడిన ఐబ్రో ఆకారపు ఎల్‌ఈడీ హెడ్‌లైట్లు, వెనుక భాగంలో ప్రత్యేకమైన వి-ఆకారపు ఎల్‌ఈడీ టెయిల్‌లైట్లు ఉన్నాయి. బ్లాక్ కలర్ ఫ్రంట్ బంపర్ వాహనానికి స్పోర్టీ లుక్‌ను మరింత పెంచుతోంది. మొత్తం డిజైన్‌లో ప్రీమియం ఫీల్ వచ్చేలా కొత్త రంగుల కలయికను కూడా అందించారు. ఈ ఎస్‌యూవీలో 19 అంగుళాల డ్యూయల్ టోన్ అల్లాయ్ వీల్స్‌ను అమర్చారు. వీల్ ఆర్చ్‌లు, లైటింగ్ డిజైన్, ముందువెనుక బంపర్‌ల సమన్వయంతో వాహనం మరింత బలమైన రోడ్ ప్రెజెన్స్‌ను కలిగి ఉంది. పరిమాణం కొద్దిగా తగ్గించినప్పటికీ గ్రౌండ్ క్లియరెన్స్ పెరగడంతో డ్రైవింగ్ అనుభవం మెరుగైనదిగా మారిందని కంపెనీ తెలిపింది ఇంటీరియర్‌ను పూర్తిగా కొత్తగా రూపకల్పన చేశారు. మునుపటి 15.67 అంగుళాల పెద్ద స్క్రీన్ స్థానంలో 12.9 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌ను అమర్చారు. డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, కొత్త స్టీరింగ్ వీల్, స్టీరింగ్ కాలమ్‌పై గేర్ సెలెక్టర్, హారిజాంటల్ ఏసీ వెంట్స్ వంటి ఆధునిక మార్పులు ఇందులో ఉన్నాయి. సౌకర్యాల పరంగా డ్యూయల్ జోన్ వాతావరణ నియంత్రణ వ్యవస్థ, గాలి శుద్ధి పరికరం, మెమరీ ఫంక్షన్‌తో పవర్డ్ డ్రైవర్ సీటు, ఎనిమిది స్పీకర్ల ఆడియో వ్యవస్థ, అధునాతన డ్రైవర్ సహాయక వ్యవస్థలు, 360 డిగ్రీ కెమెరా, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ వంటి అనేక



ప్రీమియం ఫీచర్లు ఇందులో ఉన్నాయి. బ్యాటరీ విషయానికి వస్తే, ఇందులో 60.13 కిలోవాట్ అవర్ బ్యాటరీ ప్యాక్‌ను అందించారు. ఇది ఫ్రంట్ వీల్ డ్రైవ్ కాన్ఫిగరేషన్‌తో 228 హార్స్‌పవర్ శక్తిని, 330 న్యూటన్ మీటర్ల టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఒకసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే సుమారు 500 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని కంపెనీ తెలిపింది. ఫాస్ట్ ఛార్జింగ్ ద్వారా కేవలం 30 నిమిషాల్లో 10 శాతం నుంచి 70 శాతం వరకు ఛార్జ్ అయ్యే సామర్థ్యం ఉంది. ప్రస్తుతం విన్‌ఫాస్ట్ వీఎఫ్6, వీఎఫ్7 మోడళ్లు భారత మార్కెట్లో అందుబాటులో ఉన్నప్పటికీ, కొత్త వీఎఫ్8 భారత్‌లో విడుదలపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే ఈ కొత్త డిజైన్, ఫీచర్లు భవిష్యత్తులో భారత మార్కెట్లోని ఇతర మోడళ్లలో కూడా ఉపయోగించే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

# హోమ్ లోన్ ఈఎంఐ కట్టలేదా?




**వేద న్యూస్ డెస్క్:**

గృహ రుణం (హోమ్ లోన్) తీసుకున్న తర్వాత అనివార్య కారణాల వల్ల నెలవారీ ఈఎంఐ చెల్లించలేని పరిస్థితి చాలామందికి ఎదురవుతోంది. ఉద్యోగ అనిశ్చితి, వైద్య ఖర్చులు, కుటుంబ ఖర్చుల పెరుగుదల వంటి కారణాలతో ఆర్థిక ఒత్తిడి పెరిగి చెల్లింపులు ఆలస్యం అవుతుంటాయి. అయితే ఇలాంటి పరిస్థితుల్లో కంగారు పడకుండా సరైన సమయంలో చర్యలు తీసుకుంటే సమస్యను కొంతవరకు నియంత్రించుకోవచ్చని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈఎంఐ చెల్లింపులు ఆలస్యమైతే ముందుగా చేయాల్సిన ముఖ్యమైన పని బ్యాంకును వెంటనే సంప్రదించడం. పరిస్థితిని దాచిపెట్టకుండా వివరించడంతో బ్యాంకులు రీస్ట్రక్చరింగ్ వంటి ప్రత్యామ్నాయాలను పరిశీలించే అవకాశం ఉంటుంది. దీనివల్ల నెలవారీ భారం కొంతవరకు తగ్గించుకోవచ్చు. లోన్ రీస్ట్రక్చరింగ్ ఆప్షన్లు బ్యాంకులు ఆర్థిక పరిస్థితిని బట్టి లోన్ రీస్ట్రక్చరింగ్ అవకాశాలను అందిస్తాయి. రుణ కాలపరిమితిని పెంచడం లేదా కొంతకాలం ఈఎంఐ చెల్లింపులపై తాత్కాలిక ఉపశమనం ఇవ్వడం వంటి మార్పులు చేస్తాయి. దీని ద్వారా నెలవారీ చెల్లింపుల భారం తగ్గి, తిరిగి ఆర్థిక స్థిరత్వం సాధించడానికి సమయం లభిస్తుంది. పెండింగ్ ఈఎంఐలకు ప్రాధాన్యం ఆర్థిక ఇబ్బందుల సమయంలో అనవసర ఖర్చులను తగ్గించి, ముందుగా పెండింగ్‌లో ఉన్న ఈఎంఐలను చెల్లించడానికే ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు చెబుతున్నారు. ఆలస్యం పెరిగే కొద్దీ ఆలస్య రుసుములు పెరిగి మొత్తం అప్పు భారం మరింత పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు. మరో అప్పు తీసుకోవడం ప్రమాదకరం పాత అప్పులు తీర్చడానికి అధిక వడ్డీతో కొత్త అప్పులు తీసుకోవడం సరైన పరిష్కారం కాదని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇది తాత్కాలిక ఉపశమనం ఇచ్చినా దీర్ఘకాలంలో అప్పుల భారాన్ని మరింత పెంచుతుందని చెబుతున్నారు. ఈ విధానం వ్యక్తిని అప్పుల చక్రంలోకి నెట్టే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. నిపుణుల సలహా తీసుకోవడం ఉత్తమం ఆర్థిక పరిస్థితి నియంత్రణ తప్పుతుందనిపిస్తే ఫైనాన్షియల్ అడ్వైజర్ సలహా తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఆదాయం, ఖర్చులు, అప్పులను సమీక్షించి సరైన రీపేమెంట్ ప్లాన్ రూపొందించడంలో వారు సహాయపడతారు. బ్యాంకులతో ఎలా చర్చించాలి, దీర్ఘకాలంలో అప్పుల నుంచి ఎలా బయటపడాలనే విషయాల్లో మార్గనిర్దేశం చేస్తారని నిపుణులు చెబుతున్నారు. ఈ విధంగా ముందస్తు చర్యలు తీసుకుంటే ఈఎంఐ సమస్యలను కొంతవరకు తగ్గించుకోవచ్చని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అమెజాన్‌లో 100కు పైగా కొత్త బ్యూటీ బ్రాండ్లు




**వేద న్యూస్ డెస్క్:**

భారత ఈ-కామర్స్ రంగంలో అగ్రగామి సంస్థ అమెజాన్ ఇండియా తన సౌందర్య ఉత్పత్తుల విభాగాన్ని మరింత విస్తరించేందుకు భారీ ప్రణాళికలు రూపొందించింది. దేశంలో ప్రీమియం బ్యూటీ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని 2026 సంవత్సరంలో 100కు పైగా అంతర్జాతీయ, ప్రీమియం బ్రాండ్లను తమ వేదికలో ప్రవేశపెట్టనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ కొత్త జాబితాలో ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్లు అయిన డోల్సె అండ్ గబ్బానా, లారా మెర్సియర్, ఎలెమిస్, అర్బన్ డీకే, అవెడా, లా రోష్ పోసే వంటి ప్రముఖ సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్లు ఉండనున్నాయి. అమెరికా, యూరప్ దేశాలకు చెందిన ఉత్పత్తులతో పాటు జపాన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ దేశాల ప్రత్యేక చర్మ సంరక్షణ ఉత్పత్తులను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. మధ్యప్రాచ్య దేశాలకు చెందిన ఊద్, అత్తర్ వంటి ప్రీమియం సుగంధ ద్రవ్య బ్రాండ్లను కూడా అమెజాన్ ఈ నివేదికలో ఆసక్తికర అంశం ఏమిటంటే ప్రీమియం సౌందర్య ఉత్పత్తుల కొనుగోళ్లలో సగానికి పైగా డిమాండ్ ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల నుంచే వస్తోంది. త్రిస్సూర్, డెహ్రాడూన్, పాటియాలా, గౌహతి, కొల్హాపూర్ వంటి నగరాల్లో ప్రీమియం బ్యూటీ ఉత్పత్తుల వినియోగం గణనీయంగా పెరుగుతున్నట్లు అమెజాన్ తెలిపింది. కొరియన్ చర్మ సంరక్షణ ఉత్పత్తులు, ఫ్రెంచ్ ఫార్మసీ బ్రాండ్లకు భారత్‌లో మంచి ఆదరణ లభిస్తోందని సంస్థ వెల్లడించింది. ముఖ్యంగా పురుషుల ప్రీమియం గ్రూమింగ్ విభాగం ఏటా రెండున్నర రెట్లు వృద్ధి నమోదు చేస్తోందని పేర్కొంది. వినియోగదారుల షాపింగ్ అనుభవాన్ని మరింత సులభతరం చేసేందుకు అమెజాన్ అత్యాధునిక కృత్రిమ మేధస్సు సాంకేతికతను కూడా వినియోగిస్తోంది. 'రూఫస్' అనే జనరేటివ్ ఏఐ షాపింగ్ అసిస్టెంట్, 'అమెజాన్ లెన్స్' వంటి సాంకేతికతల ద్వారా వినియోగదారులు తమ చర్మ తత్వానికి సరిపోయే ఉత్పత్తులను సులభంగా ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తోంది. అదే సమయంలో డెలివరీ వ్యవస్థను కూడా సంస్థ బలోపేతం చేసింది. దేశంలోని టాప్ 100 నగరాల్లో సగానికి పైగా బ్యూటీ ఆర్డర్‌లను అదే రోజు లేదా మరుసటి రోజు డెలివరీ చేసేలా లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను విస్తరించినట్లు అమెజాన్ వెల్లడించింది.

# ధోనీయే సీఎస్‌కే తదుపరి కోచ్?

**వేద న్యూస్ డెస్క్:**



ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఘోరంగా నిరాశపరచడంతో జట్టులో భారీ మార్పులు తప్పవన్న చర్చ క్రికెట్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలో ఈసారి సమిష్టి ప్రదర్శన కనబరచలేకపోయిన చెన్నై జట్టు.. ప్లే ఆఫ్స్ చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. దీంతో ప్రధాన కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ భవిష్యత్తుపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెద్ద చర్చకు దారితీశాయి. ఐపీఎల్ రెండో సీజన్ నుంచి చెన్నై జట్టుకు కోచ్‌గా కొనసాగుతున్న స్టీఫెన్ ఫ్లెమింగ్.. జట్టును అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీలలో ఒకటిగా తీర్చిదిద్దాడు. మహేంద్రసింగ్ ధోనీతో కలిసి ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించి చెన్నైను లీగ్‌లో అత్యంత స్థిరమైన జట్టుగా నిలబెట్టాడు. అయితే ఆధునిక ఇరవై ఓవర్ల క్రికెట్‌లో వేగవంతమైన వ్యూహాలు, పవర్ హిట్టింగ్‌కు ప్రాధాన్యం పెరిగిన నేపథ్యంలో చెన్నై ఇప్పటికీ పాత శైలినే కొనసాగిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ సీజన్ వేలంలో చెన్నై జట్టు యువ ఆటగాళ్లను కొనుగోలు చేసినప్పటికీ.. వారికి సరైన సమయంలో అవకాశాలు ఇవ్వలేకపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కార్తిక్ శర్మ, ఉర్విల్ పటేల్, ప్రశాంత్ వీర్ వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లు జట్టులో ఉన్నా.. లీగ్ దశ చివర్లో మాత్రమే వారిని బరిలోకి దింపారు. అప్పటికే జట్టు ప్లే ఆఫ్స్ అవకాశాలు దాదాపు చేజారిపోయాయి. దీంతో వచ్చే సీజన్‌కు ముందు కోచింగ్ విభాగంలో మార్పులు చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమంలో ఓ అభిమాని చేసిన వ్యాఖ్యకు స్పందించిన రవిచంద్రన్ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "చెన్నై తదుపరి కోచ్‌గా నన్ను తప్ప ఎవరినైనా ఎంపిక చేయొచ్చు" అని ఓ అభిమాని చేసిన పోస్టుకు అశ్విన్ సమాధానమిచ్చాడు. "నేను జట్టును ఎంపిక చేస్తే ప్రత్యర్థి జట్టుకే మా వ్యూహాలన్నీ తెలిసిపోతాయి. చివరికి అవినీతి నిరోధక విభాగం కూడా నన్నే ప్రశ్నిస్తుంది. కానీ మహేంద్రసింగ్ ధోనీ లాంటి వ్యక్తి జట్టులో ఉండగా కొత్త కోచ్ కోసం వెతకడం ఎందుకు?" అంటూ అశ్విన్ వ్యాఖ్యానించాడు. అశ్విన్ వ్యాఖ్యలతో ఇప్పుడు చెన్నై అభిమానుల్లో కొత్త చర్చ మొదలైంది. ధోనీ ఇప్పటికే జట్టు వ్యూహాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడని, ఆటగాళ్ల ఎంపిక నుంచి మ్యాచ్ పరిస్థితుల వరకు అతడి ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఈ సీజన్‌లో గాయం కారణంగా ధోనీ ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడం కూడా అనేక ఊహాగానాలకు దారితీసింది. ఇదిలా ఉండగా స్టీఫెన్ ఫ్లెమింగ్ కూడా ఇటీవల ధోనీ ప్రాముఖ్యతపై మాట్లాడాడు. "చెన్నై సూపర్ కింగ్స్‌కు ధోనీ ఎప్పటికీ అత్యంత కీలకమైన వ్యక్తి" అని పేర్కొన్నాడు. ఈ వ్యాఖ్యలు చూస్తుంటే భవిష్యత్తులో ధోనీకి జట్టులో మరింత పెద్ద బాధ్యత అప్పగించే అవకాశం ఉందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.చెన్నై సూపర్ కింగ్స్ చరిత్రలో ధోనీ కేవలం మాజీ కెప్టెన్ మాత్రమే కాదు.. జట్టు విజయాల వెనుక ప్రధాన శక్తిగా నిలిచాడు. ఐదు టైటిళ్లు అందించి చెన్నైను అభిమానుల గుండెల్లో ప్రత్యేక స్థానంలో నిలిపాడు. ఇప్పుడు అదే ధోనీ భవిష్యత్తులో కోచ్‌గా బాధ్యతలు చేపడతాడా అనే ప్రశ్న క్రికెట్ ప్రపంచంలో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# ఐపీఎల్ కంటే దేశవాళీ క్రికెట్ కష్టమే: ముకుల్



**వేద న్యూస్ డెస్క్:**

భారత క్రికెట్‌లో కొత్తగా వెలుగులోకి వస్తున్న యువ ఆటగాళ్లలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ప్లేయర్ ముకుల్ చౌదరి పేరు ఇప్పుడు ప్రత్యేకంగా వినిపిస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో అవకాశం దక్కిన ప్రతిసారి తన ప్రతిభను నిరూపించుకున్న ఈ యువ క్రికెటర్.. కీలక సమయాల్లో అద్భుతమైన ప్రదర్శనలతో అందరి దృష్టిని ఆకర్షించాడు. ముఖ్యంగా కోల్‌కతా జట్టుతో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో చివరి వరకు క్రీజులో నిలబడి జట్టును విజయతీరాలకు చేర్చిన తీరు అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టు ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకున్నప్పటికీ.. ఆ తర్వాత కూడా వరుస విజయాలతో ప్రత్యర్థి జట్ల సమీకరణాలను తారుమారు చేస్తూ పార్టీ స్పాయిలర్‌గా మారింది. ఈ క్రమంలో ముకుల్ చౌదరి పాత్ర కూడా కీలకంగా నిలిచింది. ఒత్తిడిని తట్టుకుని ఆడిన అతడి ఇన్నింగ్స్‌లపై మాజీ క్రికెటర్లు కూడా ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ముకుల్ చౌదరి.. ఐపీఎల్ అనుభవాల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. చాలా మంది ఐపీఎల్‌నే అత్యంత కఠినమైన టోర్నీగా భావిస్తారని, కానీ తన అనుభవం ప్రకారం దేశవాళీ క్రికెట్ మరింత కష్టంగా అనిపిస్తుందని చెప్పాడు. "ఐపీఎల్‌లో మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే కోట్లాది మంది అభిమానులు, కెమెరాలు, భారీ అంచనాలు ఎప్పుడూ మనపై ఉంటాయి. కానీ ఆట పరంగా చూస్తే కొన్ని విషయాల్లో ఇక్కడ సౌలభ్యం ఉంటుంది. ప్రత్యర్థి బౌలర్ల బలహీనతలు, వ్యూహాలు, గణాంకాలు అన్నీ ముందుగానే అందుబాటులో ఉంటాయి. వీడియో విశ్లేషణలు, సాంకేతిక సమాచారం కూడా సహాయపడతాయి" అని వివరించాడు. అయితే దేశవాళీ క్రికెట్‌లో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంటుందని ముకుల్ తెలిపాడు. "దేశవాళీ మ్యాచ్‌ల్లో ఇలాంటి డేటా, విశ్లేషణలు ఉండవు. ప్రతి మ్యాచ్‌లో కొత్త పరిస్థితులు ఎదురవుతాయి. అక్కడ ఆటగాడు తన ప్రతిభ, అనుభవం ఆధారంగానే నిలబడాలి. అందుకే దేశవాళీ క్రికెట్ నిజంగా కఠినంగా అనిపిస్తుంది" అని చెప్పుకొచ్చాడు. ఐపీఎల్‌లో తొలిసారి ఆడిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ.. "ఈ సీజన్‌లో నాకు అవకాశం వస్తుందని ప్రశాంతంగా ఆడితే ఏ స్థాయిలోనైనా రాణించొచ్చనే నమ్మకం వచ్చింది" అని వెల్లడించాడు. ముకుల్ చౌదరి వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఐపీఎల్‌లో వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని భవిష్యత్ భారత జట్టు కోసం తన పేరును బలంగా వినిపిస్తున్న ఈ యువ ఆటగాడిపై అభిమానుల్లో కూడా భారీ అంచనాలు పెరుగుతున్నాయి.

# రోహిత్ మనసు గెలుచుకున్నాడు

**వేద న్యూస్ డెస్క్:**



టీమిండియా స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ మరోసారి తన మంచి మనసుతో అభిమానుల హృదయాలను గెలుచుకున్నాడు. మైదానంలో సిక్సర్లతో అలరించే హిట్ మ్యాన్.. మైదానం బయట కూడా అభిమానుల భావోద్వేగాలకు ఎంత విలువ ఇస్తాడో మరోసారి నిరూపించాడు. తనను ఒక్కసారి కలవాలని ఎంతో ఆశపడి నిరాశతో కన్నీళ్లు పెట్టుకున్న ఓ యువతికి ప్రత్యేకంగా వీడియో సందేశం పంపి ఆమెను ఆనందంలో ముంచెత్తాడు. ఇటీవల కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ముంబయి ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ కోసం జినియా అనే యువతి ప్రత్యేకంగా స్టేడియానికి వచ్చింది. తన అభిమాన క్రికెటర్ రోహిత్ శర్మను దగ్గరగా చూడాలని, ఒకసారి మాట్లాడాలని ఆమె ఎంతోకాలంగా కలగంటోంది. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా గంటల తరబడి స్టేడియం బయటే వేచి చూసింది. డ్రెస్సింగ్ రూమ్ నుంచి ఆటగాళ్లు బయటకు వస్తున్న సమయంలో రోహిత్ కనిపించగానే ఆమె ఉద్వేగంతో "రోహిత్ భాయ్" అంటూ గట్టిగా పిలిచింది. అయితే అక్కడ ఉన్న అభిమానుల హడావుడి, శబ్దాల మధ్య ఆమె పిలుపు రోహిత్‌కు వినిపించలేదు. దీంతో రోహిత్ నేరుగా ముందుకు వెళ్లిపోయాడు. తన కల నెరవేరలేదనే బాధతో ఆ యువతి అక్కడే కన్నీళ్లు పెట్టుకుంది. ఈ దృశ్యాన్ని ఆమె బంధువులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయగా అది కాస్త వైరల్‌గా మారింది. ఈ వీడియో రోహిత్ శర్మ దృష్టికి చేరడంతో ఆయన వెంటనే స్పందించాడు.

# వినేశ్‌కు హైకోర్టు ఊరట

**వేద న్యూస్ డెస్క్:**



భారత రెజ్లింగ్ సమాఖ్యతో కొనసాగుతున్న వివాదాల మధ్య స్టార్ మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు ఢిల్లీ హైకోర్టు పెద్ద ఊరట కల్పించింది. ఆసియా క్రీడల ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు ఆమెకు అనుమతి ఇస్తూ కీలక తీర్పు వెలువరించింది. ఈ నిర్ణయంతో వినేశ్ పునరాగమనానికి ఉన్న ప్రధాన అడ్డంకులు తొలగిపోయాయి. అదే సమయంలో ఆమెకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న రెజ్లింగ్ సమాఖ్య వర్గాలకు ఈ తీర్పు గట్టి ఎదురుదెబ్బగా మారింది. ఆసియా క్రీడల ద్వారా మళ్లీ అంతర్జాతీయ స్థాయిలో తన కెరీర్‌ను కొనసాగించాలని భావించిన వినేశ్ ఫొగాట్.. భారత రెజ్లింగ్ సమాఖ్య నిబంధనలను సవాలు చేస్తూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి డి.కె. ఉపాధ్యాయ, న్యాయమూర్తి తేజస్ కరియా సభ్యులుగా ఉన్న ద్విసభ్య ధర్మాసనం ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. మే 30, 31 తేదీల్లో నిర్వహించనున్న ఆసియా క్రీడల ఎంపిక పోటీల్లో వినేశ్ పాల్గొనవచ్చని స్పష్టం చేసిన కోర్టు.. ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని ఆదేశించింది. ట్రయల్స్ మొత్తం వీడియో రికార్డు చేయాలని భారత రెజ్లింగ్ సమాఖ్యకు సూచించింది. అలాగే భారత క్రీడా ప్రాధికార సంస్థ, భారత ఒలింపిక్ సంఘానికి చెందిన స్వతంత్ర ప్రతినిధులు ఈ ఎంపికలను పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసింది.

# ప్రపంచకప్‌పై వైభవ్ ఆశలు

**వేద న్యూస్ డెస్క్:**



వన్డే ప్రపంచకప్ 2027 టోర్నీకి ఇప్పటి నుంచే భారత జట్టు ప్రణాళికలు సిద్ధమవుతున్నట్లు క్రికెట్ వర్గాల్లో చర్చ సాగుతోంది. ముఖ్యంగా ఓపెనింగ్ జోడీ విషయంలో బీసీసీఐ సెలక్టర్లు పలు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. సీనియర్ ఓపెనర్ రోహిత్ శర్మ భవిష్యత్తుపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించే దిశగా యాజమాన్యం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. గత కొద్ది రోజులుగా రోహిత్ శర్మ ఫిట్‌నెస్‌పై పలు వార్తలు వస్తున్నాయి. ప్రపంచకప్ సమయానికి ఆయన ఫిట్‌నెస్ ఎలా ఉంటుందన్న అంశాన్ని దృష్టిలో పెట్టుకుని సెలక్టర్లు ప్రత్యామ్నాయ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి ఓపెనింగ్ బాధ్యతలు ఎవరు చేపడతారన్న చర్చ మొదలైంది. ఇప్పటికే వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌ను గిల్‌కు జోడీగా పరిశీలిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అలాగే బ్యాకప్ ఓపెనర్‌గా యశస్వి జైస్వాల్ పేరును కూడా సెలక్టర్లు ఆలోచనలో ఉంచినట్లు చెబుతున్నారు. అయితే తాజాగా మరో యువ ఆటగాడి పేరు సెలక్షన్ చర్చల్లోకి రావడం ఆసక్తికరంగా మారింది. యువ సంచలన ఆటగాడు వైభవ్ సూర్యవంశీ పేరు ఇప్పుడు భారత క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. శ్రీలంక పర్యటనలో భారత్-ఎ జట్టు తరఫున అతడు రాణిస్తే, ప్రపంచకప్ 2027 జట్టులో అతడి పేరును కూడా పరిశీలించే అవకాశముందని సమాచారం.

# పింక్ బాల్‌కు ఐసీసీ గ్రీన్ సిగ్నల్?

**వేద న్యూస్ డెస్క్:**



అంతర్జాతీయ క్రికెట్‌లో వేగంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త నిబంధనలు తీసుకురావడానికి అంతర్జాతీయ క్రికెట్ మండలి కసరత్తు ప్రారంభించింది. ఆటను మరింత ఆసక్తికరంగా మార్చడం, ప్రేక్షకులకు కొత్త అనుభూతి కల్పించడం లక్ష్యంగా పలు కీలక మార్పులపై చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే మహిళా క్రికెట్‌కు ప్రాధాన్యం పెంచుతూ పురుషుల టోర్నీలతో సమానంగా నగదు బహుమతులు అందిస్తున్న క్రికెట్ మండలి.. ఇప్పుడు బంతి రంగు నుంచి మ్యాచ్ నిబంధనల వరకు పలు సంచలన నిర్ణయాల దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం టెస్టు క్రికెట్‌కే పరిమితమైన గులాబీ బంతిని ఇకపై వన్డేలు, ఇరవై ఓవర్ల మ్యాచ్‌ల్లోనూ ప్రవేశపెట్టే అంశాన్ని క్రికెట్ మండలి పరిశీలిస్తోంది. ఇప్పటివరకు పగలు-రాత్రి టెస్టు మ్యాచ్‌ల్లో మాత్రమే గులాబీ బంతిని ఉపయోగిస్తున్నారు. అయితే రాత్రి వేళల్లో బంతి స్పష్టంగా కనిపించడం, ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతి కలగడం వంటి కారణాలతో ఈ బంతిని పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనూ వాడే అవకాశాలపై చర్చలు జరుగుతున్నాయి. ఇరు జట్లు అంగీకరిస్తే పగలు-రాత్రి వన్డేలు, ఇరవై ఓవర్ల మ్యాచ్‌ల్లో గులాబీ బంతిని వాడేందుకు నిబంధనలు సవరించే దిశగా చర్యలు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ నెల 30న అహ్మదాబాద్‌లో జరిగే క్రికెట్ మండలి ప్రతినిధుల సమావేశంలో ఈ అంశాలపై కీలక చర్చలు జరిగే అవకాశముంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి కార్యదర్శి జై షా నేతృత్వంలో జరగనున్న ఈ సమావేశంలో పలు ప్రతిపాదనలకు ఆమోదం లభించే అవకాశముందని ఇప్పుడు మ్యాచ్ నిర్వహణలోనూ మార్పులు చేయాలని భావిస్తోంది. ఇరవై ఓవర్ల మ్యాచ్‌ల్లో ఇన్నింగ్స్ విరామ సమయాన్ని తగ్గించే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది. ప్రస్తుతం తొలి ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభానికి ఇరవై నిమిషాల విరామం ఇస్తున్నారు. దీనిని పదిహేను నిమిషాలకు తగ్గించాలని ప్రతిపాదిస్తున్నారు. ఆటగాళ్ల మధ్య చర్చలు, వ్యూహరచన కోసం ఐదు నిమిషాలు, మైదానంలోకి తిరిగి రావడానికి మరో పది నిమిషాలు సరిపోతాయని మండలి భావిస్తోంది. దీంతో మ్యాచ్‌లు మరింత వేగంగా ముగియడంతో పాటు



ప్రేక్షకుల్లో ఆసక్తి కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు. మరో కీలక మార్పుగా డ్రింక్స్ విరామ సమయంలో ప్రధాన కోచ్‌లకు కూడా మైదానంలోకి వెళ్లే అవకాశం ఇవ్వాలని యోచిస్తున్నారు. ప్రస్తుతం ఈ సౌకర్యం కేవలం ఇరవై ఓవర్ల మ్యాచ్‌లకే పరిమితం కాగా.. ఇకపై వన్డేలు, టెస్టుల్లోనూ అమలు చేసే దిశగా చర్చలు సాగుతున్నాయి. ప్రస్తుతం డ్రింక్స్ తీసుకెళ్లే ఆటగాళ్లు తప్ప ఇతరులకు అనుమతి ఉండదు. అయితే కోచ్‌లకు అనుమతి ఇస్తే వారు కూడా జట్టు దుస్తుల్లోనే రావాలా లేదా అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. అలాగే మైదానంలోని అంపైర్లకు హాక్-ఐ సాంకేతిక వివరాలను పరిశీలించే అవకాశం కల్పించే అంశంపైనా చర్చ జరుగుతోంది.

# సచిన్‌పై రూట్ ప్రశంసలు

**వేద న్యూస్ డెస్క్:**



టెస్టు క్రికెట్‌లో అత్యధిక పరుగుల రికార్డును అధిగమించే అవకాశాలపై వస్తున్న చర్చలకు ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ స్పందించాడు. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో తన పేరును పోల్చడమే తనకు గొప్ప గౌరవమని పేర్కొన్నాడు. సచిన్ సాధించిన విజయాలు అసాధారణమని, ఆయన స్థాయికి చేరుకోవడం చాలా కష్టమని అభిప్రాయపడ్డాడు. ఓ క్రీడా మాధ్యమానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన రూట్.. సచిన్ రికార్డుపై తరచూ ప్రశ్నలు ఎదురవుతున్నాయని తెలిపాడు. అయితే రికార్డుల గురించి కంటే ఆటను ఆస్వాదించడం, జట్టుకు ఉపయోగపడే ఇన్నింగ్స్ ఆడటంపైనే తన దృష్టి ఉంటుందని చెప్పాడు. సచిన్ ఈ క్రీడలో సాధించిన ఘనతలు ప్రత్యేకమైనవని, ఆయనతో పోల్చడమే తనకు ఎంతో ఆనందంగా అనిపిస్తుందని వివరించాడు. సచిన్ సుదీర్ఘ కెరీర్‌ను కూడా రూట్ ప్రత్యేకంగా ప్రశంసించాడు. తాను పుట్టకముందే సచిన్ టెస్టుల్లో అరంగేట్రం చేశారని, తాను తొలి టెస్టు ఆడే సమయానికి కూడా ఆయన అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగుతున్నారని గుర్తు చేశాడు. టెస్టుల్లోనే కాకుండా వన్డేల్లో కూడా యాభై సెంచరీలు సాధించడం సాధారణ విషయం కాదని పేర్కొన్నాడు.భారతదేశంలో అపారమైన అభిమానాన్ని సంపాదించుకుని, నిరంతరం అంచనాల ఒత్తిడిలోనూ సచిన్ నిలకడగా రాణించడం అద్భుతమని రూట్ కొనియాడాడు. అంతటి ఒత్తిడిని తట్టుకుని ఎన్నో సంవత్సరాలు అత్యున్నత స్థాయిలో ఆడటం గొప్ప విషయమని చెప్పాడు.

వేద న్యూస్

ఆదివారం మే 24 , 2026

# ఏఐ డీప్‌ఫేక్‌పై రుక్మిణి ఆగ్రహం

**వేద న్యూస్ డెస్క్:**



'సప్త సాగరాలు దాటి' సినిమాతో తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కన్నడ నటి రుక్మిణి వసంత్ ఇటీవల ఒక వివాదం కారణంగా వార్తల్లో నిలిచారు. ఆమెకు సంబంధించినట్లు ప్రచారం అవుతున్న బికినీ ఫోటోలు, వీడియో క్లిప్స్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో సినీ వర్గాల్లో పెద్ద చర్చ మొదలైంది. గ్రీన్ రంగు బికినీ ధరించి స్విమ్మింగ్ పూల్‌లోకి దిగుతున్నట్లు కనిపించిన ఆ విజువల్స్ ఒక్కసారిగా నెటిజన్ల దృష్టిని ఆకర్షించాయి. ఆ వీడియోల్లో చుట్టూ కెమెరాలు, సాంకేతిక సిబ్బంది కనిపించడం వల్ల అవి ఏదైనా అధికారిక ఫోటోషూట్ లేదా సినిమా చిత్రీకరణలో భాగమై ఉంటాయని కొందరు భావించారు. అయితే మరికొందరు మాత్రం అవి కృత్రిమ మేధస్సు సాంకేతికతతో రూపొందించిన డీప్‌ఫేక్ చిత్రాలేమోనని అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ చర్చ సామాజిక మాధ్యమాల్లో వేగంగా విస్తరించడంతో విషయం మరింత వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో నటి రుక్మిణి వసంత్ అధికారికంగా స్పందిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. తన పేరిట ఇంటర్నెట్‌లో ప్రచారం అవుతున్న బికినీ ఫోటోలు, వీడియోలు పూర్తిగా నకిలీవని ఆమె స్పష్టం చేశారు. అవి కృత్రిమ మేధస్సు సాయంతో సృష్టించిన డీప్‌ఫేక్ చిత్రాలేనని వెల్లడించారు. ఎలాంటి వాస్తవ ఆధారాలు లేకుండా తప్పుడు సమాచారంతో ఇలాంటి కంటెంట్ తయారు చేసి వైరల్ చేయడం చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు. ఇతరుల వ్యక్తిగత గోప్యతను దెబ్బతీసే విధంగా మార్ఫింగ్ కంటెంట్ తయారు చేయడం తీవ్రమైన నేరమని రుక్మిణి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి నకిలీ వీడియోలు, చిత్రాలు సృష్టించడం ఆందోళనకర విషయమని తెలిపారు. కేవలం వినోదం లేదా వైరల్ కోసం చేసే ఇలాంటి చర్యలు వ్యక్తుల ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని, మానసికంగా కూడా తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని తన బృందం చాలా సీరియస్‌గా తీసుకుంటోందని ఆమె వెల్లడించారు. ఈ ఫోటోలు, వీడియోలను తయారు చేసిన వారిపై మాత్రమే కాకుండా, వాటిని తెలిసీ తెలియక సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తూ ప్రచారం చేస్తున్న వారిపై కూడా సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నామని స్పష్టం చేశారు. ఇటీవల కృత్రిమ మేధస్సు సాంకేతికత విస్తరిస్తున్న నేపథ్యంలో డీప్‌ఫేక్ ఘటనలు కూడా పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రముఖుల ఫోటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి నకిలీ కంటెంట్ తయారు చేయడం పెద్ద సమస్యగా మారిందని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా సినీ నటీమణులు, ప్రజాదరణ ఉన్న వ్యక్తులు ఎక్కువగా ఇలాంటి దుష్ప్రచారానికి గురవుతున్నారని చెబుతున్నారు. నెటిజన్లకు కూడా రుక్మిణి ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. ఇంటర్నెట్‌లో కనిపించే ప్రతి వీడియో, ఫోటోను నిజమని నమ్మవద్దని, నిజానిజాలు తెలుసుకోకుండా వాటిని ఇతరులకు షేర్ చేయవద్దని కోరారు. బాధ్యతాయుతంగా వ్యవహరించి నకిలీ కంటెంట్ వ్యాప్తిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఈ ఘటన సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. పలువురు సినీ ప్రముఖులు కూడా రుక్మిణికి మద్దతుగా నిలుస్తూ డీప్‌ఫేక్ సాంకేతికత దుర్వినియోగంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతికతను మంచికి ఉపయోగించాల్సిందిపోయి వ్యక్తుల ప్రతిష్ఠను దెబ్బతీసేలా వినియోగించడం బాధాకరమని అభిప్రాయపడుతున్నారు.

# నాగార్జునకు నలభై ఏళ్ల సినీ ప్రయాణం

**వేద న్యూస్ డెస్క్:**




టాలీవుడ్‌లో సుదీర్ఘకాలంగా తనదైన ముద్ర వేసుకుంటూ వస్తున్న సీనియర్ స్టార్ హీరో నాగార్జున నేటితో హీరోగా నలభై ఏళ్ల విజయవంతమైన సినీ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. దివంగత నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు వారసుడిగా సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఆయన.. తన ప్రత్యేక నటన, వైవిధ్యమైన కథల ఎంపికతో తెలుగు చిత్రసీమలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. నాగార్జున హీరోగా నటించిన తొలి చిత్రం 'విక్రమ్' 1986 మే 23న విడుదలైంది. ఆ సినిమాతో ప్రారంభమైన ఆయన ప్రయాణం నేటికి నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకుంది. అందుకే సినీ వర్గాలు ఆయనను 'సెల్యులాయిడ్ సైంటిస్ట్'గా కూడా అభివర్ణిస్తుంటాయి. ఈ సందర్భంగా నాగార్జున సామాజిక మాధ్యమాల ద్వారా భావోద్వేగపూరిత సందేశాన్ని పంచుకున్నారు. మే 23 తన జీవితంలో ఎప్పటికీ మరచిపోలేని ప్రత్యేకమైన తేదీ అని పేర్కొన్నారు. తన తొలి చిత్రం 'విక్రమ్' విడుదలైన రోజు కూడా ఇదేనని, అలాగే తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు చివరి చిత్రం 'మనం' కూడా ఇదే తేదీన విడుదల కావడం ఎంతో భావోద్వేగంగా అనిపిస్తుందని తెలిపారు. 'మనం' సినిమా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన నాగార్జున.. తన తండ్రితో పాటు తన కుమారులు నాగచైతన్య, అఖిల్‌లతో కలిసి ఒకే తెరపై కనిపించే అదృష్టం ఆ సినిమాతో దక్కిందని చెప్పారు. ఆ చిత్రాన్ని నిర్మించడం, విడుదల చేయడం తన జీవితంలో అత్యంత గర్వకారణమైన విషయమని పేర్కొన్నారు. ఇన్నేళ్లుగా తనపై అభిమానులు కురిపిస్తున్న ప్రేమ, ఆశీర్వాదాలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రేక్షకుల ఆదరణ వల్లే తాను ఇంత సుదీర్ఘకాలం సినీ ప్రయాణాన్ని కొనసాగించగలిగానని చెప్పారు. భవిష్యత్తులో కూడా మంచి కథలతో ప్రేక్షకులను అలరించేందుకు ప్రయత్నిస్తానని వెల్లడించారు. నాగార్జున సినీ ప్రయాణాన్ని పరిశీలిస్తే.. 'శివ', 'గీతాంజలి', 'హలో బ్రదర్', 'నిన్నే పెళ్లాడతా', 'అన్నమయ్య', 'మన్మథుడు', 'సోగ్గాడే చిన్నినాయనా' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలు ఆయన కెరీర్‌లో ప్రత్యేక స్థానం సంపాదించాయి. ముఖ్యంగా భిన్నమైన పాత్రలను ఎంచుకోవడంలో ఆయన చూపిన ధైర్యం ఎంతో మంది హీరోలకు స్ఫూర్తిగా నిలిచింది. ప్రస్తుతం కూడా యువ హీరోలకు పోటీగా వరుస సినిమాలు చేస్తూ నాగార్జున తన జోరు కొనసాగిస్తున్నారు. అరవై ఆరు ఏళ్ల వయసులోనూ అదే ఉత్సాహంతో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తుండటం విశేషంగా చెప్పుకోవచ్చు. ఆయన నలభై ఏళ్ల సినీ ప్రయాణం సందర్భంగా అభిమానులు, సినీ ప్రముఖులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# 'సలార్ 2'పై ప్రశాంత్ నీల్ క్లారిటీ



**వేద న్యూస్ డెస్క్:**

రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'సలార్ పార్ట్–2' సినిమాపై దర్శకుడు ప్రశాంత్ నీల్ కీలక స్పష్టత ఇచ్చినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత కొంతకాలంగా ఈ సినిమా ఆగిపోయిందనే ప్రచారం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, తాజా సమాచారం అభిమానుల్లో మళ్లీ ఉత్సాహాన్ని నింపింది. 'సలార్ పార్ట్–1' విడుదల సమయంలోనే చిత్రబృందం రెండో భాగం కూడా ఉంటుందని ప్రకటించింది. ప్రభాస్ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం భారీ యాక్షన్ సన్నివేశాలు, భావోద్వేగ కథనం, అద్భుత దృశ్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఖాన్సార్ సామ్రాజ్యం నేపథ్యంలో దేవ, వరదరాజ మన్నార్ పాత్రల చుట్టూ నడిచిన కథ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. అయితే ఇటీవల దర్శకుడు ప్రశాంత్ నీల్ మరో భారీ పౌరాణిక చిత్రం తెరకెక్కించబోతున్నారనే వార్తలు రావడంతో 'సలార్ 2' ప్రాజెక్ట్ నిలిచిపోయిందనే అనుమానాలు మొదలయ్యాయి. ఈ ప్రచారం అభిమానుల్లో ఆందోళనకు దారితీసింది. ఈ నేపథ్యంలో ప్రశాంత్ నీల్ స్పందిస్తూ ప్రస్తుతం ఎన్టీఆర్‌తో తెరకెక్కిస్తున్న 'డ్రాగన్' చిత్రం పూర్తయ్యాక వెంటనే 'సలార్ 2' పనులు ప్రారంభిస్తానని చెప్పినట్లు సమాచారం. దీంతో సినిమా పూర్తిగా ఆగిపోలేదని, కేవలం షెడ్యూల్ కారణంగా ఆలస్యం మాత్రమే జరుగుతోందని స్పష్టమైంది. మరోవైపు ప్రభాస్ కూడా వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'ఫౌజీ', 'స్పిరిట్', 'కల్కి 2898 ఏడీ' రెండో భాగం పనులు కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టులు కొంతవరకు పూర్తయ్యే సమయానికి ప్రశాంత్ నీల్ కూడా తన ప్రస్తుత చిత్రాన్ని పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అన్ని అనుకున్నట్లుగా సాగితే 2027 చివరి నాటికి 'సలార్ 2' చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని సమాచారం. మొదటి భాగాన్ని మించిన స్థాయిలో యాక్షన్, భావోద్వేగాలు, విజువల్ ఎఫెక్ట్స్‌తో రెండో భాగాన్ని మరింత భారీగా రూపొందించేందుకు మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 'సలార్ 2'పై భారీ అంచనాలు నెలకొని ఉండగా, తాజా స్పష్టతతో ప్రభాస్ అభిమానులు మళ్లీ ఈ ప్రాజెక్ట్‌పై భారీ ఆశలు పెట్టుకున్నారు.

# 'లెనిన్' టీజర్‌కు మంచి స్పందన

**వేద న్యూస్ డెస్క్:**




అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'లెనిన్'పై ప్రేక్షకుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. యువ దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే సినిమా ప్రకటనతో మంచి అంచనాలు నెలకొనగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్‌ను తీసుకొచ్చింది. ఈ చిత్రం జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుండగా, చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. మరోవైపు అక్కినేని నాగార్జున సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 40 సంవత్సరాలు పూర్తయిన ప్రత్యేక సందర్భంగా 'లెనిన్' టీజర్‌ను విడుదల చేయడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. విడుదలైన టీజర్‌లో అఖిల్ స్టైలిష్ లుక్‌తో పాటు మాస్ యాటిట్యూడ్‌లో కనిపించాడు. ముఖ్యంగా ఆయన చెప్పిన సంభాషణలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. "మనోడు వస్తున్నాడుడ", "నేను తప్పిపోయి రాలేదు.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చాడ" వంటి డైలాగులు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. టీజర్‌లో అఖిల్ స్క్రీన్ ప్రెజెన్స్, యాక్షన్ షాట్లు అభిమానులను ఆకట్టుకుంటున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. టీజర్‌పై నాగార్జున కూడా స్పందిస్తూ తనకు ఇది ఒక ప్రత్యేక సర్‌ప్రైజ్‌లా అనిపించిందని తెలిపారు. మొత్తం టీజర్ ఎంతో హాయిగా, ఆకట్టుకునేలా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు కూడా అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచాయి. ఇటీవల వరుస సినిమాలతో ప్రేక్షకులను మెప్పించేందుకు ప్రయత్నిస్తున్న అఖిల్‌కు 'లెనిన్' చిత్రం ఎంతో కీలకంగా మారింది. గత చిత్రాల ఫలితాల తర్వాత మంచి విజయంతో తిరిగి నిలదొక్కుకోవాలని భావిస్తున్న అఖిల్‌కు ఈ సినిమా మైలురాయిగా మారుతుందా అన్న చర్చ సినీ వర్గాల్లో కొనసాగుతోంది. టీజర్‌ను బట్టి చూస్తే సినిమాలో యాక్షన్, భావోద్వేగాలు, మాస్ అంశాలు సమపాళ్లలో ఉండబోతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో జూన్ 26న విడుదల కానున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# పెళ్లి కారణంగా అవకాశం కోల్పోయా

**వేద న్యూస్ డెస్క్:**



గ్లామర్ రంగంలో మహిళల వ్యక్తిగత జీవితం కూడా కెరీర్‌పై ప్రభావం చూపుతుందనే చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. ప్రముఖ యాంకర్, బిగ్‌బాస్ ఫేమ్ స్రవంతి చొక్కారపు తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పెళ్లైందనే కారణంతో ఒక పెద్ద సినిమా అవకాశం కోల్పోయానని ఆమె వెల్లడించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన స్రవంతి తన కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎదురైన అనుభవాన్ని పంచుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఒక పెద్ద ప్రాజెక్ట్ కోసం ఆడిషన్ ఇచ్చానని, నటన, రూపం పరంగా తనను ఎంపిక చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని తెలిపింది. ఆ పాత్రకు తానే సరైన ఎంపిక అన్న సంకేతాలు కూడా వచ్చాయని చెప్పింది. అయితే చివరి దశ చర్చల సమయంలో తన వ్యక్తిగత జీవితం గురించి ప్రశ్నలు అడిగారని స్రవంతి వెల్లడించింది. "నాకు పెళ్లైందా అని అడిగారు. నేను నిజాయితీగా అవునని చెప్పాను. ఆ విషయం చెప్పిన వెంటనే పరిస్థితి మారిపోయింది" అని తెలిపింది. ముందుగా షూటింగ్ కోసం చెన్నై రావాలని, అడ్వాన్స్ కూడా ఇస్తామని చెప్పారని గుర్తుచేసుకుంది. కానీ పెళ్లి విషయం తెలిసిన తర్వాత కొద్దిసేపట్లో తిరిగి కాల్ చేస్తామని చెప్పిన వారు మళ్లీ స్పందించలేదని పేర్కొంది. చివరకు ఆ సినిమా అవకాశం తనకు రాలేదని వెల్లడించింది. తర్వాత ఆ ప్రాజెక్ట్ కూడా నిలిచిపోయిందని స్రవంతి చెప్పుకొచ్చింది. అయితే ఆ సంఘటన తనను మానసికంగా నిరాశపరిచినా, కెరీర్ విషయంలో మాత్రం వెనక్కి తగ్గలేదని తెలిపింది. కష్టపడి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నానని పేర్కొంది. స్రవంతి చొక్కారపు చిన్న యూట్యూబ్ ఛానెళ్లలో యాంకర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించింది.

# 'పెద్ది' ఈవెంట్‌కు భారీ హైప్

**వేద న్యూస్ డెస్క్:**




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, జాన్వీ కపూర్ కథానాయికగా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంలో స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, టీజర్‌తో ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించిన భారీ ఈవెంట్ మరింత చర్చనీయాంశంగా మారింది. సినిమా బృందం నేడు భోపాల్‌లో భారీ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ వేడుకలో ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ప్రత్యక్ష సంగీత ప్రదర్శన ఇవ్వనుండగా, సినిమాకు సంబంధించిన కొత్త పాటను కూడా విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో అభిమానుల్లో భారీ ఉత్సాహం నెలకొంది. ప్రస్తుతం ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. నిర్వాహకులు ఊహించిన దానికంటే చాలా పెద్ద స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. దాదాపు లక్ష మందికి పైగా అభిమానులు ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ అంచనాలు నిజమైతే, గతంలో ఉత్తరాదిలో నిర్వహించిన భారీ తెలుగు సినిమా కార్యక్రమాలకు సమానంగా ఈ వేడుక నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073